ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం । 17 సెప్టెంబర్ 2025 । ■ 15 పేజీలు




8

ఖనిజ రంగం అభివృద్ధికి

# రూ.32వేల కోట్లు

బంగారం, రాగి అన్వేషణకు సింగరేణికి అనుమతి లైసెన్సు పత్రాలను సీఎండీ బలరామ్‌కు అందజేసిన కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



## సొంత గూటికి చేరిన

# సస్పెన్షన్ నేతలు

- ■ హస్తం బలపడేనా..?
- ■ హస్తం గూటికి తిరుగుబాటు నేతలు. గండ్రత్ సుజాత, సాజిద్ ఖాన్, సంజీవ రెడ్డి
- ■ హస్తంలో గ్రూపులు వీడీ చేతులు కలిసేనా..?
- ■ చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మీనాక్షి నటరాజన్
- ■ కంది శ్రీనివాస్ రెడ్డికి హైకమాండ్ షాక్..
- ■ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పీపీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఘర్ వాపసీ పాలిటిక్స్ సంచలనంగా మారుతోంది. ఇటీవల ప్రకటించినట్లుగానే కాంగ్రెస్ పార్టీ ఘర్ వాపసీ ప్రారంభించింది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ముగ్గురు నేతలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ టికెట్ ఆశించి భంగపడ్డారు. తమ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని ప్రకటించారు. కానీ అధిష్టానం మాత్రం కంది శ్రీనివాస్ రెడ్డికి టికెట్ కేటాయించింది. దీంతో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఈ ముగ్గురిలో సంజీవరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ విజయం సాధించగా బీఆర్ఎస్ అభ్యర్థి జోగురామన్న రెండో స్థానంలో, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి మూడో స్థానంలో నిలువగా సంజీవ్ రెడ్డి నాలుగో స్థానంలో నిలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఆదిలాబాద్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలు తీసుకున్న నిర్ణయాల పట్ల.. పార్టీ అధిష్టానం క్రమశిక్షణలో చర్యల్లో భాగంగా ఆరేళ్ల పాటు సస్పెన్స్ వేటు వేసింది. అయితే ఈ నేతలు పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అదే విధంగా వీరిని పార్టీలోకి రానివ్వకుండా ఓ నేత కూడా తన ప్రయత్నాలు తాను చేశారు. కానీ ఎట్టకేలకు ఏఐసీసీ సెక్రటరీ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు అధిష్టానం సీనియర్లను తిరిగి సొంతగూటికి ఆహ్వానించింది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి, మరోవైపు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వర్గాలు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో మాజీ నేతలు సొంతగూటికి చేరడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. దీంతో జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ పరిణామాలు మారనున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

14

■ వీరుల త్యాగఫలం.. నేటి స్వేచ్ఛా సుమం.. ■ రజాకార్ల గుండెల్లో గుబులు పుట్టించిన మహనీయులు ■ చెయ్యెత్తి సలాం చేసిన నిజాం ప్రభువు..

■ నిజాం గుండెల్లో గుబులు రేపిన కుమ్రంభీం ■ గెరిల్లా పోరాటాలకు పురిటి గడ్డగా నిలిచిన నిర్మల్ ■ నేడు తెలంగాణ విమోచన దినోత్సవం..

'అయ్యా.. నీ బాంచెన్' అన్న మనుషులు నిజాం గుండెల్లో నిప్పులు చెరిగారు.. కాల్మొక్త.. అన్న చేతులు తరతరాల వెట్టి బతుకుల విముక్తి లక్ష్యంగా బందూకులు పట్టాయి.. శతాబ్దాల నిజాం నిరంకుశ పాలనలో జాగీరుదారులు, ముక్తేదారులు, ఇనాందార్లు, వారి అనుయాయులు సాగించిన దౌర్జన్యాలు, దుర్మార్గాలను సహించి మౌనంగా భరించిన వారంతా ఎదురు తిరిగారు.. సాయుధులై పాలకుల కోటలు, గడీల పునాదులను పెకిలించారు.. గడగడలాడించారు. ఈ ప్రయత్నంలో ఎందరో అమరులయ్యారు.. వీరి త్యాగాల ఫలితంగానే దాస్యశృంఖలాల నుంచి విముక్తులమయ్యాం.. ఇది చరిత్రాత్మక సాయుధ రైతాంగ పోరాటం.. అఖండ భారత స్వప్నాన్ని సాకారం చేసేందు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సారథ్యంలో భారత సైన్యం నడుంబిగించింది.. తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టగానే ఆ ధాటికి బెంబేలెత్తిపోయిన నిజాం రాజు చేతులెత్తేశాడు.. తెలంగాణను పాకిస్తాన్‌లో కలిపేస్తానని ప్రటకన చేస్తానన్న నోటితోనే భారత జాతీయ జెండాకు చెయ్యెత్తి సలాం చేశాడు.. ఆ శుభ మహోత్సవమే 17 సెప్టెంబర్ 1948. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆనాటి కొట్టి ఘట్టాలు.. పోరాడిన మహనీయుల గురించి ప్రభాత సమాచారం కథనం..

# వీరులారా వందనం





బెల్లంపల్లి అటవీ రేంజ్‌లో

## పెద్దపులి సంచారం

- ■ అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ వెల్లడి
- ■ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కుమ్రంభీం వర్ధంతి వేడుకలకు

# ఘనంగా నిర్వహించాలి

- ■ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయలి..
- ■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రంభీం 85వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరెమెరి మండలం జోడేఘాట్‌లో కుమ్రం భీం 85వ వర్ధంతిని పురస్కరించుకొని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హెలిప్యాడ్, వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసి కుమ్రం భీం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుమ్రం భీం వర్ధంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.





## రైతుల అవసరమైన మేరకు
# యూరియా పంపిణీ

- యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు
- రైతుల అవసరం మేరకు యూరియా పంపిణీ
- ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు వేగిరం చేయాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)** జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమారం మండలంలో గత సంవత్సరం 14 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించబడిందని, ఈ సంవత్సరం ఇప్పటికే 11 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా మండలంలో అవసరం ఉన్న ప్రకారం 3, 4 రోజులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలలో యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూరియాను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని, ఈ క్రమంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య



అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్ధ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి భారీ వర్షం
# కూలిన ఇంటి గోడ

**బోథ్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)** మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మర్లపెల్లి గ్రామంలో ఇంటి గోడ కూలిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భారీ వర్షం పడడంతో పడిగేల రాములుకు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అన్నారు. అంతేగాకుండా బోథ్ గ్రామంలోని ఒకటో వార్డులో అధిక వర్షం వల్ల ట్రాన్స్ఫార్మర్ గద్దె కూలడంతో ట్రాన్స్ఫార్మర్ క్రింద పడిపోయింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్ఫార్మర్ పడిపోయిన విషయాన్ని విద్యుత్ సిబ్బంది తెలుసుకొని అర్ధరాత్రి వరకు ట్రాన్స్ఫార్మర్ దగ్గర మరమ్మత్తులు చేపట్టి విద్యుత్తును పునరుద్ధరించారు. అయితే భారీ వర్షం పడడంతో పలు కాలనీలలో ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ఇంట్లో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



# వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బ తిన్న రహదారులు, తదితర వాటి పరిస్థితి పై సమీక్షించేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరదల ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణంగా పరిష్కరించేందుకు తాత్కాలిక, శాశ్వత చర్యలపై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు. ముఖ్యంగా మావల చిన్న చెరువు, ఖానాపూర్ ట్యాంక్ నుండి నీరు మితిమీరిన నేపథ్యంలో ఏర్పడిన సమస్యలను కలెక్టర్ సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీటిపారుదల, మున్సిపాలిటీ శాఖల అధికారులను సంయుక్తంగా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు కలెక్టర్ కువివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీన్ రాజు, ఇరిగేషన్ అధికారి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు

## మాత, శిశు ఆసుపత్రిని తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






**నిర్మల్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. అనంతరం లాబొరేటరీ, స్కానింగ్ కేంద్రం, ఇన్‌వార్డు, అవుట్‌వార్డు, ఆపరేషన్ థియేటర్, ఓపి వార్డు, బాలింతల వార్డులను సందర్శించి రోగుల పరిస్థితి, అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులకు పలు సూచనలు చేస్తూ గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు సమయానికి అందించాలన్నారు. ప్రసవాల సమయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులతో మృదు వుగా, శ్రద్ధగా వ్యవహరించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రోగుల విశ్వాసాన్ని నిలబెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఆసుపత్రి పర్యవేక్షకులు సరోజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ సార్‌కు కృతజ్ఞతలు

## సైబర్ బాధితుడికి 10 రోజుల్లో 41,800 అందేలా చర్యలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)** రాథోడ్ సునీల్ రిక్షా కాలనీకి చెందిన వ్యక్తి ఈనెల గత సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తన అకౌంట్ లోకి రావలసిన 41 వేల 800 రూపాయలను వేరే అకౌంట్ లోకి వెళ్లిన సందర్భం పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ బృందానికి బాధితునికి తిరిగి రావాల్సిన డబ్బులపై సూచనలు చేయగా, కడప సైబర్ క్రైమ్ బృందానికి సంప్రదించి తన అకౌంట్ లోకి రావాల్సిన డబ్బులను తిరిగి వచ్చే విధంగా కృషి చేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధితుడు రాథోడ్ సునీల్ జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. సైబర్ క్రైమ్‌పై స్పందించి వెంటనే స్పందించి తనకు న్యాయం చేసిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎంతగానో కృతజ్ఞతలు అంటూ జిల్లా ఎస్పీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, సిబ్బంది రియాజ్, త్రిశూల్, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ



మంచిర్యాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





### వ్యక్తిగత పరిశుభ్రత

# మనందరి బాధ్యత

## హెల్త్ అసిస్టెంట్ కమలాకర్

జన్నారం, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) జన్నారం మండలంలోని సింగరాయిపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. కార్యక్రమంలో హెల్త్అసిస్టెంట్ కొల్లూరు కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పరిశుభ్రత పాటించకుంటే దోమలు తయారై డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. జన్నారం ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది సింగరాయిపేటలో ఉచిత వైద్య శిబిరంవద్ద వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ వైద్య సిబ్బంది నవీన్, దేవమ్మ, తిరుమల పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలు



బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ 69వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లార్పు చిన్నరాజ్యం ,పట్టణ అధ్యక్షులు మల్లయ్య, మాజీ జెడ్పీటీసి రామచందర్, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ చిలువేరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మునిమంద రమేష్, దావ రమేష్, నయీమ్, మాజీ కౌన్సిలర్లు కటకం సతీష్, బొడ్డు నారాయణ, గెల్లి రాయలింగు, సురేష్, చింతపండు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సన్నీ బాబు, సేవాలాల్ జిల్లా అధ్యక్షులు బండి రాము తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22వ తేదీ నుండి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

## మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య

మంచిర్యాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) జిల్లాలో ఈనెల 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు ఓపెన్ ఎస్.ఎస్.సి., ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 22, 23, 24, 25, 26, 27, 28 తేదీలలో కార్యచరణ ప్రకారంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అక్టోబర్ 6, 13 తేదీలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.



### గోదావరి నదిలో నీటి పరిస్థితిని

# ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) ఎక్కువ ప్రాంతాల నుండి గోదావరి నదిలో నీరు చేరుతున్న దృష్ట్యా నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీర ప్రాంతాన్ని మండల తహసిల్దార్ రఫతుల్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో వర్షం కురుస్తున్నందున ప్రాజెక్టుల నుండి వరద నీరు గోదావరి నదిలోకి చేరుతుందని, ఈ నేపథ్యంలో నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఇందు కొరకు పోలీస్, మున్సిపల్ శాఖల నుండి సిబ్బందిని నియమించి గోదావరి నది తీర ప్రాంతంలో నీటి పరిస్థితిని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) ఈ నెల 17వ తేదీన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి పోలీస్, రెవెన్యూ, పంచాయితీ రాజ్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. వేడుకలలో భాగంగా జిల్లా అభివృద్ధిపై సందేశం ఇస్తారని, కార్యక్రమానికి వచ్చే వారికి త్రాగునీరు, అల్పాహారం, నీడ, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పాత్రికేయులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వేదిక అలంకరణ, పోడియం, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాహనాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రముఖులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని, కలెక్టరేట్ లో పనిచేసే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని, ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బస్తాలు తక్కువ, వచ్చిన రైతులు ఎక్కువ



**తాండూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం చేపట్టిన యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమం భారీ బందోబస్తు నడుమ కొనసాగింది. కొత్తపల్లి రైతు వేదిక వద్దకు వెళ్లేందుకు యూరియా లోడు లారీలు, ఆటోలకు వెళ్లలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రహదారి పక్కనే ఈ యూరియా బస్తాల పంపిణీ కొనసాగింది. మండలానికి కేవలం 500 బస్తాలు మాత్రమే రావడంతో అధికారులు రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా ఒక్క పాస్‌బుక్‌కు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. కానీ రైతులు మాత్రం 1500పైనే తరలి వచ్చి పడిగాపులు కాశారు. ఈ చేతగాని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఉండాల్సిన రైతాంగం ఒక్క బస్తా యూరియా కోసం పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. పండు ముసలోళ్లు, వృద్ధులు, యువకులు, మహిళలు యూరియా కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న తీరు ప్రతి ఒక్కరిని బాధించింది. మాదారం త్రీ ఇంక్లైన్‌కు చెందిన గాంధారి పోశవ్వ ఆమె కొడుకు, కోడలు కూడా ఉదయం 7 గంటలకే వచ్చి లైన్‌లో వేచి ఉన్నారు. లైను ఎంతకూ కదలకపోవడం మరోవైపు ఆకలి బాధతో వృద్ధురాలు బాధపడుతుండటంతో కుమారుడు లైన్‌లో నుంచి బయటకు వచ్చి హోటల్ నుంచి అల్పాహారం తీసుకు వచ్చివ్వడంతో ఆదర బాదరాగా ఆ అవ్వ అక్కడే ఆకలి బాధ తీర్చుకోవడం గమనార్హం. అయినా వారికి యూరియా దొరకలేదు..! కొందరు వృద్ధులు యూ రియా తీసుకునేందుకు వచ్చి లైన్‌లో ఇబ్బందులు పడు తుండగా అధికారులు, ఎస్ఐలు, పోలీసులు వారికి సహకరించారు. రైతులు పెద్ద ఎత్తున రావడంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా తాండూర్, మాదారం ఎస్ఐలు కిరణ్, సౌజన్య ఏఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.





## విద్యార్థులకు రుచికరమైన
# భోజనం అందించాలి

**నార్నూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించేలా చూడాలని గాదిగూడ గిర్దావార్ తిరుపతి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జుని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికాల పాఠశాలను సందర్శించారు. ఝరి ప్రభుత్వ దవాఖాన వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వంటకాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నపాటి జ్వరం వచ్చిన దవాఖానను ఆశ్రయించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాథోడ్ రవీందర్, ప్రధానోపాధ్యాయుడు శ్యాం రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, వైద్య సిబ్బంది ఉన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని రెండో వార్డుకు చెందిన మాదరబోయిన రవికుమార్ అనారోగ్య చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకోగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ యువ నాయకుడు నిచ్చకోల వంశీకృష్ణ చేతుల మీదుగా అందించారు. తన అభ్యర్థుల మేరకు సహాయం అందజేసిన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్, యువ నాయకులు వంశీకృష్ణకు మాదరబోయిన రవికుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సుంగపూర్‌లో రాపిడ్ ఫీవర్ సర్వే

**నార్నూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ పకడ్బందీగా రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని వైద్యాధికారి సంజీవ్ కుమార్ చెప్పారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం సుంగపూర్ గ్రామంలో ఝరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. స్థానికుల వివరాలు నమోదు చేసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పరిశుభ్రత లోపిస్తే వ్యాధులు సోకే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని, ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సంజయ్, ఏఎన్ఎం చంద్రకళ, హెచ్ఏ మోహన్, ప్రకాష్, ఆశా కార్యకర్త నిర్మల ఉన్నారు.





## మంత్రి పర్యటన నేపథ్యంలో
# బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

**కోటపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరులో రాష్ట్ర కార్మిక శాఖ, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన నేపథ్యంలో కోటపల్లి మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలం కాగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు హెూరెత్తు తున్నాయి. చెన్నూరులో మంత్రి వివేక్‌కు కూడా నిరసన సెగ తగిలే అవకాశం ఉందని ముందస్తుగా కోటపల్లి మండల బీర్ఎస్ నాయకుల ఇంటికి వెళ్లి మంగళవారం ఉదయమే పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమాచారం బయటకు వెళ్లకుండా ఉండేందుకు పోలీస్ లు వారివద్ద నుండి సెల్ ఫోన్లు సైతం లాక్కున్నారు. మీడియా కు సైతం ఫొటోస్ తీసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు

# బాధిత కుంటుంబానికి అండగా ఉంటాం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని బూదాకుర్ధు గ్రామంలో మంగళవారం ఎద్దు దాడి చేయడంతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జంగంపల్లి రాజారాం కుటుంబ సభ్యులను టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పరామర్శించారు. అంతకుముందు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే వినోద్ మాట్లాడు రాజారాం కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం

**నిర్మల్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
తల్వేద గ్రామంలో ఇర్ల జంగన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ రాం రెడ్డి ఐ కేర్ సహకారంతో వైద్యులు గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు గ్రామస్తులను పరీక్షించి టీకాలు ,అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**మందమర్రి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు సలేంద్ర సత్యనారా యణ పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్‌లు డిమాండ్ చేశారు. పట్టణం లోని ఎఐటీయుసీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్స వాలను పురస్కరించు కొని పార్టీ జెండా ను సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజు ఆవిష్కరించి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాసిపిఐ నాయకులు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నవాబు లకు వ్యతిరేకంగా జమీందారు, దేశముఖ్ భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం లో దొడ్డి కొమురయ్య తొలి అమరుడయ్యారన్నారు. భువనగిరిలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహాసభ ద్వారా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, బద్దం



ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ లు గేరిల్లా దళాలను ఏర్పాటు చేసి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ పార్టీకే దక్కుతుందన్నారు. సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలను వదిలారని, వారి ఉద్యమ స్ఫూర్తిగానే హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో సెప్టెంబర్ 17న విలీనం చేసి నిజాం నవాబులు వెళ్లిపోవారిని వారు స్పష్టం చేశారు. కేంద్రంలోనీ బిజెపి ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం మద్య జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూన్నారని, తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు పాల్గొన లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట విలీన దినోత్సవాన్ని ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలని సాయుధ పోరాట చరిత్రను, అమరవీరుల త్యాగాలను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని వారు కోరారు. సెప్టెంబర్ 11 నుండి 17 వరకు గ్రామ, పట్టణ, మండల కేంద్రాలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తూ సాయుధ పోరాట చరిత్రను అమరవీరుల త్యాగాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 17 ముగింపు సభ హైదరాబాద్ లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియం లో నిర్వహిస్తున్నామని, ఈ ముగింపు సభకు పార్టీ ప్రజా సంఘాల శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం
# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాస్తారోకో

**తాండూరు, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, తాండూరు మండలంలో జూనియర్ కళాశాల మంజూరు చేయకపోతే రానున్న ఎలక్షన్లో విద్యార్థుల శక్తి ఏంటో చూపిస్తాం అని తాండూరు మండల కేంద్రం ఐబిలో జాతీయ రహదారిపై బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని, విద్యార్థులు తల్లిదండ్రులు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉండని అలాంటి విద్యార్థులు మేనేజ్మెంట్ ఫీజులు భరించకపోవడం వల్లనే స్కాలర్షిప్ పై ఆధారపడి ఎంతోమంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు.ఎస్సి, ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థుల స్కాలర్షిప్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను అరిగోసలు పెడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఇంటర్, ఉన్నత విద్యాసంస్థలైనటువంటి డిగ్రీ, పిజీ ఎంబీబీఎస్, ఎంబీఏ, ఫార్మసీ, బిఈడి, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు, వృత్తి విద్య కోసం సంబంధించిన విద్యాసంస్థలు అన్ని కూడా ఏక తాటిపైకి వచ్చి స్కాలర్షిప్ విడుదల అయ్యేంతవరకు కళాశాలలు మూసివేస్తామని చెప్పన్నారని పేర్కొన్నారు. అంటే ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది అని దుయ్యబట్టారు. అంతేకాకుండా విద్యార్థులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఇక్కడ ఎన్నికల సమయంలో తాండూరు మండలానికి జూనియర్ కళశాల తీసుకువస్తాను అని మాయ మాటలు, అబద్ధపు హామీ ఇచ్చి మరిచిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇప్పటి వరకు కళాశాల మాట ఎత్తకపోవడం వలన ఈ మండలంలోని ఎంతో మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. ఎంతో మంది పేద విద్యార్థుల చదువుకు దూరం అయి ఎటు కాకుండా పోతున్నారు అని వారు ఆవేదన చెందారు. వెంటనే ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళశాల ప్రారంభించక పోతే నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున దశలవారీగా కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అదే విధంగా రానున్న ఎలక్షన్ లో విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ తాండూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు ఆడెపు అరుణ్, సీనియర్ నాయకుడు జాడి పోశం, కిష్టఫర్, అదువాల సత్యనారాయణ, చింటూ, కాటం రాకేష్, రిజ్వాన్, చోదన్, ప్రశాంత్, సరిష్, అక్రం, జుబేర్, ఇమానుఎల్, కైఫ్, రంజిత్, శివ శంకర, చరణ్, వినయ్, కుమార్, బీఆర్ఎస్వీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎన్నిక.. ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు



**కుభీర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
ఓ వైపు పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ పదవుల కోసం ఎన్నికలు పెట్టి.. మరోవైపు చట్టసభలకు ప్రజాప్రతిని ధులకు ఎన్నుకున్నట్టుగా ఎన్నికల పోలింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఎంతోమంది టీచర్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు కుబీర్ జెడ్పీహెచ్ఎస్ సిబ్బంది. నిర్మల్ జిల్లా కుబీర్ లోని జెడ్పి హైస్కూల్లో మంగళవారం హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నిక కోసం పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సట్ల గంగాధర్ పర్యవేక్షణలో మాక్ పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కొనసాగించారు. మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికల లాగే నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్ పదవులకు 8 మంది విద్యార్థులు నామినేషన్ వేయగా, ఇద్దరి నామినేషన్లను తిరస్కరించారు. మరో ఇద్దరు విత్ డ్రా చేసుకున్నారు. పోటీలో నిలిచిన నలుగురు విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పర్యవేక్షకులుగా బారె శ్రీనివాస్, స్వాతి, వాణి, విజయ్ కుమార్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## వీడీసీల ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధం

**వీడిసిల అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు.**
**ఇప్పటివరకు 16 కేసులను నమోదు.**
**జైనథ్ మండలం ఆనందపూర్‌లో 8 మందిపై కేసు**
**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
గ్రామ అభివృద్ధి కమిటీలు ప్రజలకు భారంగా, ప్రజల వద్ద న్యాయస్థానాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించకుండా గ్రామ అభివృద్ధి పేరుతో వసూలు చేయడం చట్ట వ్యతిరేకమని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. గ్రామ అభివృద్ధి పేరుట అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారంగా కేసులు నమోదు చేయబడతాయని అందులో భాగంగానే ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో ఇప్పటివరకు 16 కేసులను నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. గ్రామాల లో బెల్ట్ షాపులను కల్లు దుకాలను ఇసుక తవ్వకాలకు అనధికారికంగా అనుమతులు ఇవ్వడం వీడీసీలకు అర్హతలు లేవని స్పష్టం చేశారు. వారి అనుమతితో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్వహించే వారిపై వీడీసీలపై కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఎవరైనా గ్రామ అభివృద్ధి వలన ఇబ్బందులు ఎదుర్కొనే వారు దగ్గరలో ఉన్న తమ పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని భవిష్యత్తులో అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి బహిష్కరణలకు వసూళ్లకు దండాలకు వీడీసీలు పాల్పడిన యెడల కచ్చితంగా చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలియజేశారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో 16 కేసుల నమోదు కాగా అందులో జైనథ్ సర్కిల్ పరిధిలో పది కేసులు, బోథ్ సర్కిల్ పరిధిలో 2 కేసులు, ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో 4 కేసులో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం జైనథ్ మండలం ఆనందపూర్ గ్రామానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఇసుక వేలంపాటకు ప్రయత్నించడం కారణంగానే వీరిపై ఎక్స్టార్షన్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 34 మందిని పరీక్షించగా అందులో 11 గురికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సిర్పూర్ శాసనసభ్యులు,ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.

## పింఛన్లు పెంచాలని ఆందోళన

**తాండూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
గత ఎన్నికల ప్రచారం సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల పింఛన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నాయకులు, వికలాంగులు ఆందోళన నిర్వహించి, అనంతరం తహశీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచకుండా, నూతన పింఛన్లు మంజూరు చేయకుండా పేద ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. అయితే, ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి స్పందించి, వికలాంగుల పింఛన్ రూ.6,000కు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఇతర చేయూత పింఛన్ దారుల పింఛన్ రూ. 4,000కు, పూర్తి కండరాల క్షీణత కలిగిన వారికి ఏపీ ప్రభుత్వం లాగా నెలకు రూ.15,000 పింఛన్ ఇవ్వాలన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదా రులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శంకర్, రత్నం ఐలయ్య, గణేష్ పాల్గొన్నారు.



## ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు.. నిలిచిన రాకపోకలు

**బోథ్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
మండలంలోని నక్కలవాడ గ్రామ సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో మంగళవారం పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిగిని, కంటేగామ కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని చెప్పారు. వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# విద్యా రంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

**అదనపు కలెక్టర్ దీపక్ తివారి**



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అగర్వాడ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (మోడీ)ను సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కెజిబివిలో 10వ తరగతి విద్యార్థులకు ఖాన్ అకాడమీ ద్వారా అందిస్తున్న విద్య బోధన తీరును పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా విద్యా బోధన చేయాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాధికారి ఆదే ప్రకాష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భరత్, ఎ. ఈ., సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సమాజంలో ఉపాధ్యాయుల కీలకం

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

జైనూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ట్రస్మ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్రావు, రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరిలు అన్నారు. మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ లో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమంగా విద్య బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి, మెమొంటోలతో సత్కరించారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ జమీల్, షబ్బీర్ అలీ, రాజు, జిల్లా అధ్యక్షుడు దేవా భూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా స్వాక్ పర్సన్ నరేందర్, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ



కాసిపేట, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద మంగళవారం చేపట్టిన యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమం పోలీస్ బందోబస్తు నడుమ కొనసాగింది. కేవలం 266 బస్తాలు మాత్రమే రావడంతో అధికారులు ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక్క పాస్ బుక్ కు ఒక బస్తా చొప్పున పంపిణీకి ఏర్పాట్లు చేశారు. రైతులు ఉదయం 3 గంటలమే వచ్చి యూరియా కోసం రైతు వేదిక, సహకార సంఘం కార్యాలయానికి చేరుకొని క్యూ కట్టారు. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి రైతు వేదికలో రైతులను కూర్చో బెట్టి లైన్ విధానంలో పాస్ బుక్స్ తీసుకొని ఒక్క పాస్ బుక్ కు ఒకటి చెప్పున బస్తా ఇచ్చే విధంగా రసీదు రాసి ఇవ్వడంతో సహకార సంఘం వద్ద రసీదు చూపిన వారికి బస్తా ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. రైతులు భారీగా తరలి రావడంతో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఒక్కో బస్తా మాత్రమే ఇవ్వడంపై రైతులు అసహనానికి గురయ్యారు. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒకటే బస్తా ఇస్తే ఎలా సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విడుతల వారీగా వచ్చిన విధంగా రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నామని, మళ్ళీ వస్తాయని, రాగానే సమాచారం ఇచ్చి అందరికీ అందిస్తామని సహకరించాలని ఏవో చల్ల ప్రభాకర్ రైతులకు వివరించారు. ఏఈవో శ్రీధర్, సహకార సంఘం సీఈవో రాజశేఖర్ పాల్గొన్నారు.



## తాండూర్‌లో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

తాండూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) మోక్షగుండం విశ్వేశరయ్య జయంతిని పురస్కరించుకొని మంగళవారం తాండూర్ వాసవి క్లబ్, వాసవి వనిత సింధూర్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మండలంలోని హౌసింగ్ ఏఈ నక్కల కావ్య, పంచాయతీ రాజ్ ఏఈ తూర్పటి సాయిలత లకు పూల మొక్కలు అందించి శాలువాతో సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్స్ జిల్లా కార్పోరేటివ్ వైస్ చైర్మన్ వాసవియన్ గోల్డెన్ స్టార్ కె సి జి ఎస్ సంతోష్ కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షులు మధుసూదన్ ,మాజీ అధ్యక్షులు కాసం భాస్కర్, వాసవి వనిత సింధూర్ క్లబ్ కార్యదర్శి మాధురి, కోశాధికారి కల్పన సభ్యులు సాయి కృష్ణ ,పుల్లూరి సంతోష్ కాసం సునీత ,లింగ సంతోషిని, భోనగిరి స్పందన ,కాసనగొట్టు సాయి కృప, కొంకుముట్టి సాహితి ,చిలువేరు సునీత తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ

మందమర్రి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) ఏరియాలోని కార్మిక క్రీడాకారులకు ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. జిఎం కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మిక క్రీడాకారులతో పాటు నియర్ బై క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్అండ్ గేమ్స్ అసోసియేషన్ 2025-26 సం.కు గాను ఇండోర్ గేమ్స్, నియర్ బై ఏరియాకి ఎంపికైన క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకొని విజయ తీరాలను చేరుకోవాలని సూచించారు.



## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



జైనూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) జైనూర్ మండలం జంగాం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపట్టాలని జంగాం మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సజ్జద్ అలీ సూచించారు. జంగాం గ్రామ సడక్ గూడ మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కోప్షన్ సభ్యుడు సజ్జద్ అలీ పలు ఇళ్లను సందర్శించారు. ఇంటి పరిసరాల్లో నీటి గుంతలు ఉండగా అందులో దోమలు నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమకాటు కారణంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా వ్యాప్తి చెందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎం చూహాన్ పరమేశ్వారి ఆశ వర్కర్ జాదవ్ సురేఖ పాల్గొన్నారు.

## కలెక్టర్ గారు మీరైనా.. న్యాయం చేయండి సార్..!




బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం) తమ కుటుంబ సభ్యుల నుండి తమ కుటుంబాన్ని కాపాడాలని భీమిని మండలం మల్లిడి గ్రామపంచాయతీ దుబ్బ గూడెం గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు పెద్దపల్లి వెంకటేశం, పెద్దపల్లి ప్రశాంత్ ను పోలీసులను వేడుకుంటున్నారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 48 లో 30 ఏళ్లుగా సాగు చేస్తున్న తమ రెండెకరాల లావాని పట్టా భూమిలో తమ పెదనాన్నలు పెద్దపల్లి శంకరి, పెద్దపల్లి రామయ్య, పాలోళ్లైన అన్నదమ్ములు పెద్దపల్లి నగేష్, పెద్దపల్లి సురేష్, పెద్దపల్లి గణేష్‌లు దౌర్జన్యంగా వచ్చి బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అనేకసార్లు అప్పటి భీమిని ఎస్సై వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోగా తనపైనే రౌడీషీట్ పెట్టారని పెద్దపల్లి ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమే బెల్లంపల్లిలో ఏసీపీని సంప్రదిస్తే తనపై ఆరు కేసులు పెట్టినట్లు తెలిసిందన్నారు. పోలీసులు తప్పుడు కేసులు పెట్టినట్లు పెద్దపల్లి ప్రశాంత్ ఆరోపించారు. తన తాత ఉమ్మడి వారసత్వంగా సంక్రమించిన భూమిలో పంపకాలు కాకుండానే ఇంటి నిర్మాణం చేపడుతుంటే అడ్డుకోబోయిన తనపై దాడి చేసి గాయపరి చారని తెలిపారు. తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా భీమిని ఆసుపత్రిలో చికిత్స చేశారని తెలిపారు. తాను ఎన్నిసార్లు పోలీసులను న్యాయం కోసం వేడుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడి చేసిన తన పెదనాన్న పెద్దపల్లి శంకర్ అతని కుమారులు పెద్దపల్లి నగేష్, పెద్దపల్లి సురేష్, పెద్దపల్లి గణేష్ లపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ.. నేడు అధికారిక ప్రకటన

**ఆదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంచలనం రేగింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న ప్రముఖ జర్నలిస్టు, సామాజిక కార్యకర్తగా పేరుగాంచిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న కొత్త రాజకీయ పార్టీ స్థాపనపై ప్రకటన చేశారు. బీసీ సామాజిక వర్గానికి రాజకీయ రాజ్యాధికారాన్ని అందించాలన్న లక్ష్యంతోనే ఈ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు.

**బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం...**

తాజాగా జరిగిన ఓ మీడియా సమావేశంలో మల్లన్న మాట్లాడుతూ "రాష్ట్రంలో బీసీలు ఎన్నో దశాబ్దాలుగా చిన్నచూపుకు గురవుతున్నారు. కేవలం రిజర్వేషన్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరిపోదు. వారికి నేరుగా పాలనా బాధ్యతలు రావాలి. బీసీలు ఐక్యత చూపిస్తే రాష్ట్ర రాజకీయ దిశను మలిచే శక్తిగా మారవచ్చు," అని పేర్కొన్నారు.

**పార్టీ పేరు మాత్రం సస్పెన్స్...**

కొత్త పార్టీ స్థాపనపై స్పష్టత ఇచ్చినప్పటికీ, దాని పేరు, ప్రారంభ తేదీ వంటి కీలక విషయాలను మాత్రం మల్లన్న ఇంకా వెల్లడించలేదు. అయితే వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసి బీసీల మద్దతుతో రాజకీయంగా ప్రభావం చూపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**కవిత వ్యాఖ్యలపై తీవ్ర స్పందన...**

తాజా పరిణామాలకు కారణంగా భావించదగిన అంశం బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు. బీసీ రిజర్వేషన్లపై ఆమె చేసిన ప్రకటనలపై మల్లన్న తీవ్ర స్థాయిలో స్పందించడంతో పాటు, ఆమెను రాజకీయంగా నిలదీశారు. దీనికితోడు మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడికి దిగిన ఘటన చర్చనీయాంశమైంది.

**గతంలోనూ రాజకీయ పార్టీ ప్రయత్నం...**



ఇది మల్లన్న తొలిసారి రాజకీయ పార్టీ స్థాపన ప్రయత్నం కాదు. 2023 ఎన్నికలకు ముందు కూడా తెలంగాణ నిర్మాణ పార్టీ పేరుతో ఓ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించినట్లు ప్రకటించారు. యువత, బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీగా టీఎన్పీను తీర్చిదిద్దుతామని చెప్పినా అది కాగితాలకే పరిమితమైంది. ఆ పార్టీ ద్వారా కుటుంబ పాలనలకు చెక్ పెడతామని ప్రకటించినప్పటికీ, మల్లన్న చివరికి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు

**జన్నారం, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలో గ్రామ పాలన అధికారులు విధుల్లో చేరారని స్థానిక తహశీల్దార్ రాజా మనోహర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులకు సహకరించేందుకు ప్రభుత్వం 16 మంది గ్రామ పాలన అధికారులను కేటాయించిందని వారికి కేటాయించిన గ్రామాల్లో వారు విధుల్లో చేరారని ఆయన తెలిపారు. పాత క్లస్టర్ ప్రకారం ప్రభుత్వం వారిని కేటాయించడం జరిగిందన్నారు. పాత పట్వారీల విధులనే వారు నిర్వర్తించాల్సి ఉంటుందని ఆయన అన్నారు విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని ఆయన కోరారు.

## విద్యార్థుల ప్రగతి ప్రశంసనీయం



**మందమర్రి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రగతి ప్రశంస నీయమని విద్యార్థులు చదువుల్లో చక్కటి ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని  తెలంగాణ మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు శ్రీనివాస చారి కోరారు. మంగళవారం జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్యతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని లైబ్రరీ, సైన్స్ లాబ్స్ ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కెహెచ్ఏఎన్ అకాడమీ ఫిజిక్స్ చాలా చక్కగా నిర్వహిస్తున్నారని, వీటికి సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాఠశాల వాతావరణం, విద్యార్థుల ప్రగతిపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ పాఠశా లను సందర్శించారు.

## నిర్మల్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

**నిర్మల్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

స్థానిక ఎస్టియు భవన్ నిర్మల్ లో ఏర్పాటుచేసిన నిర్మల్ మండల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా డి. లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి. ఖాలిద్, ఆర్థిక కార్యదర్శి తాళ్ల లఖన్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఇష్టాక్, పోశెట్టి, కృష్ణ కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా జుట్టు గజేందర్, జె.లక్ష్మణ్, ఇర్ఫాన్ షేక్,వెంకటేశ్వరరావు, ఇంతియాజ్, సంతోష్ కుమార్, ఏం. శ్రీనివాస్, రాందేవ్, ఎన్నికల పరిశీలకులుగా మా రెడ్డి శ్రీనివాస్ వ్యవహరించారు.



## బెల్లంపల్లిలో రావణ దహనాన్ని అడ్డుకుంటాం



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

రానున్న విజయదశమి రోజున బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ క్రీడా మైదానంలో నిర్వహించే రావణ దహన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం బెల్లంపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో దళిత సంఘాల నాయకుల, సభ్యుల నుండి అభిప్రాయాలు సేకరించారు. రావణాసురుడు దహనం పేరుతో బిజెపి, ఆర్ఎస్ ఎస్, హిందూ ఉత్సవ కమిటీ వాటి అనుబంధ సంస్థలు వ్యాపారుల దగ్గర, రాజకీయ నేతల దగ్గర డబ్బులు వసూలు చేసి రావణున్ని దహనం చేస్తూ దళితుల మనోభావాలను దెబ్బతీస్తూ ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. రావణాసుర దహనానికి ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని అధికారులను వేడుకున్నారు.

## ఏఈవో లేక పంట నమోదుకు ఆటంకం

**కుభీర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రం కుబీర్‌కు వ్యవసాయ విస్తీర్ణ అధికారి గత కొంతకాలంగా  లేకపోవడంతో పంట నమోదు ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో మండల కేంద్రానికి చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు.  సోయా కోతకు వచ్చిన నేపథ్యంలో ఇప్పటికీ ఇంకా పంట నమోదు ప్రక్రియను ప్రారంభించకపోవడం పట్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం లేకపోలేదు. మండలంలో కుబీర్ తో పాటు సోనారి, పల్సి, కసర, డోడర్న, పార్డి, చాత, నిఘ్వా  9 క్లస్టర్లు ఉన్నాయి. అన్ని క్లస్టర్లకు ఏఈవోలు ఉండగా  మండల కేంద్రమైన కుబీర్‌కు ఏఈవో లేకపోవడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు, రైతు నాయకులు ఏవో సారికను కలిసి ఏవోను నియమించాలని వినతిపత్రం అందజేశారు. అయిన ప్పటికీ ఇప్పటివరకు ఏవోను నియమించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట నమోదు ప్రక్రియ చేపట్టే విధంగా చూడాలని కోరుతున్నారు.






## రోడ్డు ప్రమాదాల నివారణకు రెబ్బెన ఎస్ఐ చర్యలు

**రెబ్బెన, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

కొమురంభీం జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్ నూతన ఎస్.హెచ్.ఓ.  ఎ.వెంకట కృష్ణ, సిబ్బందితో కలిసి వాంకులం గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ చొరవను చూసిన స్థానికులు ఎస్.ఐ. వెంకట కృష్ణ, పోలీసు బృందానికి ధన్యవాదాలు తెలిపి అభినందించారు

## ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడికి రెండేళ్ల పదవీకాలం



**నిర్మల్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల, డీటీఎన్బీడబ్ల్యూఈడి హైదరాబాద్ రీజినల్ బోర్డ్ సభ్యుడిగా మరో రెండేళ్లపాటు కొనసాగనున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ చైర్మన్ జానకి రామ్ ఆయనకు ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 68వ కార్మిక విద్యా దినోత్సవాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘనంగా నిర్వహించింది.

## రక్తదాన శిబిరాన్నిప్రారంభించిన ఎమ్మెల్యే

**కౌటాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా విమల లైఫ్ కేర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే లబ్ధి దారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ దేవయ్య, తహసిల్దార్ ప్రమోద్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి: జీసీడీఓ శకుంతల



**బెజ్జూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిసిడివో శకుంతల అన్నారు. బెజ్జూర్, చింతలమానపల్లి  మండలాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను జిసిడివో శకుంతల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించే భోజనంను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఇప్పటినుండి పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే కృషి చేస్తానని తెలిపారు. వారి వెంట ప్రధాన ఉపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

బుధవారం। 17 సెప్టెంబర్। 2025
https: epaper.prabhathasamacharam.com


# వీరులారా.. జోహార్

■ వీరుల త్యాగఫలం.. నేటి స్వేచ్ఛా సుమం.. ■ రజాకార్ల గుండెల్లో గుబులు పుట్టించి జిల్లా ఖ్యాతిని చాటిచెప్పిన మహనీయులు ఎందరో.. ■ చెయ్యెత్తి సలాం చేసిన నిజాం ప్రభువు.. ■ నిజాం నవాబు గుండెల్లో గుబులు రేపిన 'భీం' ■ అలుపెరగని పోరాట యోధుడు 'కొండ' ■ గెరిల్లా పోరాటాల పురిటి గడ్డ నిర్మల్ ■ నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

## నిజాం నవాబు గుండెల్లో గుబులు రేపిన

# కోదమ సింహం 'భీం'



దేశానికి స్వాతంత్ర్య లభించిన తెలంగాణా ప్రాంతంలో పాలన కొనసాగిస్తున్న నైజాం ప్రభుత్వం ఆనాడు గిరిజనులపై జరుపుతున్న అన్యాయం, నైజాం ప్రభుత్వ ఉద్యోగులు కొనసాగిస్తున్న వేదింపులు తీవ్రరూపం దాల్చా యి. అనాధిగా అడవితల్లిని నమ్ముకుంటున్న ఆదివాసుల శ్రమదోపిడి, వారి భూములు, ఆస్తులను దోచుకుంటూ అడవుల్లోకి తరిమి వేస్తున్న తరుణంలో ఈదోపిడిని ఎదురిం చాలని జల్‌జంగిల్ జమీన్‌పై గిరిజనులు పూర్తి హక్కు సాధించాలన్న భావనతో నైజాం నిరంకుశపాలనకు నిరసనగా కొమరంభీం నైజాం పాలనపై తిరుగుబాటు ప్రకటించాడు. దీంతో నైజాం ప్రభుత్వం ఓ గిరిజనుడు తిరుగుబాటు ప్రకటించడానికి గల కారణాలు కనుగోని వాటిని పరిష్కరించాలని అప్పటి ఆసిఫాబాద్ జిల్లా అధికారులను చర్చలకు పంపించింది. అయినా కొమరంభీం అడవులు, అటవిభూములు, అటవి సంపద పై పూర్తి హక్కు గిరిజనులకే కల్పించాలని పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో నైజాం ప్రభుత్వం పై తిరుగుబాటు ప్రకటించి నేటి కెరమెరి మండలం జోడేఘాట్ పర్వతాల పై నుండి సాయుధపోరాటం ప్రారంభించారు. పక్షంరోజుల పాటు జరిగిన పోరాటంలో చివరికి కొమరంభీం నైజాం సైన్యం తుపాకిగుండ్లకు ప్రాణాలు అర్పించినప్పటికి ఆయన తెలంగాణా సాయుధపోరాటంలో చిరస్తాయిగా నిలిచిపోయారు. తెలంగాణా విమోచన దినం సెప్టెంబర్ 17న ఆయన గిరిజనానికి అందించిన పోరాట స్పూర్తిని గిరిజనులు ప్రతిఏటా గుర్తుకుతెచ్చుకుంటారు. నేడు ప్రజాప్రభుత్వాలు ఆదివాసుల కోసం ప్రత్యేక అధికార యంత్రాంగాన్ని ఏర్పాటుచేసి ఆర్థిక, విద్య, తదితర రిజర్వేశన్‌లు అమలు చేయడానికి కారణం కూడ కొమ రంభీం సాయుధపోరాటం కారణమని చెప్పవచ్చు. నైజాం సైన్యం కాల్పుల్లో కొమరంభీం ప్రాణత్యాగం చేశాక అప్పటినైజాం ప్రభుత్వం ఓ గిరిజన యువకుని పై ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించడానికి బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మానవ పరిణామశాస్త్రవేత్త క్లిస్టోఫర్ హైమన్‌డాఫ్ ను జిల్లా పంపించి ఆయన కొద్ది సంవత్సరాల పాటు మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తు ప్రతి గిరిజన గ్రామంను సందర్శించి కొమరంభీం తిరుగుబాటుకు గల కారణాలను గిరిజనుల స్థితిగతులపై అధ్యాయనం చేసి ఆనాటి నైజాం పాలకులకు నివేదిక సమర్పించారు. ఆసమయంలోనే నైజాం పాలన అంతమై ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి డార్ఫ్ అందించిన నివేదిక ఆధారంగా గిరిజనులు సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించింది. ఆనాటి నుండి నేటి వరకు ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధికి చేస్తున్న కృషి భీం ప్రాణత్యాగ ఫలితమని చెప్పవచ్చు. నేటికి ప్రభుత్వం గిరిజన సంక్షేమ కార్యక్రమాల్లో కొమరంభీం పేరును ప్రముఖంగా ఉపయోగిస్తూ ఉంటుంది. తెలంగాణా సాయుధపోరాటంలో కీలకవ్యక్తిగా కొమరంభీం పేరు చిరస్థాయిగా నిలుస్తోంది.



# చెయ్యెత్తి సలాం చేసిన నిజాం ప్రభువు



తెలంగాణ ప్రజల దాస్య శృంఖలాలు ఛేదించబడిన రోజు. తెలంగాణ అంతటా స్వాతంత్ర్య పరిమళాలు విస్తరించబడిన రోజు. స్వేచ్ఛా వాయువులు తెలంగాణ వాసుల శ్వాసలై పల్లవించిన రోజు. రజాకార్ల అరాచకాలను ఎదురొడ్డి ప్రాణత్యాగం చేసిన ఆత్మలు శాంతించిన రోజు. త్యాగ జీవుల కుటుంబాల బడబాగ్ని చల్లారిన రోజు. ఇంతటి భావోద్వేగాల సమ్మేళనమైన సెప్టెంబర్17ను అధికారిక ఉత్సవంగా జరపాలన్నది తెలంగాణ ప్రజల ఆకాంక్ష. ప్రభుత్వాలు ఈ విషయమై ఉపేక్షించడం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అగ్నికి ఆజ్యంలా తోడవుతుంది. తెలుగు నేలకు వందనం, సిరులనేలకు వందనం, స్నిగ్ధభారతి హరిహారం తెలంగాణ వందనం అని ఈ గడ్డపుట్టిన ప్రతిబిడ్డ, జీవిస్తున్న ప్రతి జీవి యావత్ ప్రకృతి పాడు కుంటూ తెలంగాణ విమోచనను జాతీయ పండగగా ప్రకటించాలన్నది ప్రధాన డిమాండ్‌గా

గత 61సంవత్సరాలుగా నినాదమై మారు మోగుతూనేవుంది. రాష్ట్ర ప్రభుత్వాలు అధినేతలు రాజకీయ కారణాలతో ఈ నినాదాన్ని పెడ చెవిన పెడుతున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధీనంలో ప్రభుత్వాలు, బిజెపి ఆధీనంలోని ప్రభుత్వాలు ప్రజల కోర్కెను తీర్చకపోయాయి. ఇది తెలంగాణ ప్రజల దురదృష్టమా! పాలకుల అహంభావమా అన్న ప్రశ్న ప్రతి మనసులో బరువుగా కదలాడుతోంది.

*'అయ్యా.. నీ బాంచెన్' అన్న మనుషులు నిజాం గుండెల్లో నిప్పులు చెరిగారు.. కాల్మొక్త.. అన్న చేతులు తరతరాల వెట్టి బతుకుల విముక్తి లక్ష్యంగా బందూకులు పట్టాయి. శతాబ్దాల నిజాం నిరంకుశ పాలనలో జాగీరుదారులు, ముక్తేదారులు, ఇనాందార్లు, వారి అనుయాయులు సాగించిన దౌర్జన్యాలు, దుర్మార్గాలను సహించి మౌనంగా భరించిన వారంతా ఎదురు తిరిగారు.. సాయుధులై పాలకుల కోటలు, గడీల పునాదులను పెకిలించారు... గడగడలాడించారు.*

*ఈప్రయత్నంలో ఎందరో అమరులయ్యారు. వీరి త్యాగాల ఫలితంగానే దాస్య శృంఖలాల నుంచి విముక్తులమయ్యాం. ఇది చరిత్రాత్మక సాయుధ రైతాంగ పోరాటం... అఖండ భారత స్వప్నాన్ని సాకారం చేసేందుకు ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్ సారధ్యంలో భారత సైన్యం నడుంబిగించింది. తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టగానే ఆధాటికి బెంబేలెత్తిపోయిన నిజాం రాజు చేతులెత్తేసాడు.*

*తెలంగాణను పాకిస్తాన్‌లో కలిపేస్తానని ప్రకటన చేస్తానన్న నోటి తోనే భారత జాతీయ జెండా మువ్వన్నెల పతాకాన్ని ప్రశంసించి, చెయ్యెత్తి సలాం చేసాడు. ఆ శుభ మహోత్సవమే 17సెప్టెంబర్ 1948. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆనాటి కొన్ని ఘట్టాలు.. పోరాడిన మహనీయుల గురించి.*

# అలుపెరగని పోరాట యోధుడు 'కొండ'

భారత స్వాతంత్ర్యోద్యమంతో పాటు హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలువడానికి విశేష కృషి చేసిన తెలంగాణా ప్రాంతపు సమరయోధుల్లో స్వర్గీయ కొండలక్ష్మణ్ బాపుజీ ప్రముఖుడు, ఆయన స్వస్థలం అప్పటి హైదరాబాద్ సంస్థానంలో భాగమై ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న రాజుర. ఆయన 19 15 సెప్టెంబర్ 27న వాంకిడిలో తన మేనత్త ఇంట్లో జన్మిం చాడు. తన మూడవ ఏటనే తండ్రి మరణించడంతో వాంకిడి లోని మేనత్త ఇంట్లో పెరిగారు. చిన్ననాటి నుండి ఆదర్శభా వాలు గల బాపుజీ స్వాతం త్ర్య సమరంతో తన జన్మస్థల మైన వాంకిడికే వన్నెతెచ్చారు. బాపుజీ హైదరాబాద్ సంస్థా నంలోని విమోచన ఉద్యమం సందర్భంగా 1938లో మొద టిసారి అరెస్టయ్యారు. 1941,42 కట్ట ఉద్యమంలో పాల్గొన డంతో పాటు 1941 ఆంధ్రమహాసభలో చేరి తెలంగాణా ప్రాంతంలో క్రియాశీలక పాత్ర పోషించారు. 1942,43లో క్విట్ ఉద్యమం సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సత్యాగ్రహం తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. విప్లవ కరపత్రాలు పంపిణి చేసినందుకు కొండలక్ష్మణ్ బాపూజి ఇంటిపై పోలీసులు 1942లో దాడులు నిర్వహించగా ఆయన తప్పించుకున్నారు. 1945లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పై నిషేధాన్ని రద్దుచేసిన వెంటనే ఆయన అందులో చేరారు. 1946, 48 మధ్య కాలంలో హైదరాబాద్ ఆశ్రమం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడాన్ని రజాకరుల దౌర్జన్యాల నుండి ప్రజలకు రక్షణ కల్పించడానికి పౌరరక్షణ చేశారు. హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూని యన్‌లో విలీనం కావాలని ఉద్యమాలు నిర్వహించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ట్యాంక్‌బండ్ వద్దగల జనదృశ్యంలో తన పనితనాన్ని తెలంగాణా రాష్ట్ర సమితి ఆవిర్భవించిన తర్వాత ఆపార్టీ కార్యాలయ నిర్మాణానికి అప్పగించగా అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

# అమరవీరుల త్యాగఫలం.. తెలంగాణకు విమోచన ఫలం

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికి హైదరా బాద్ సంస్థానంగా చేసుకుని నిరంకుశపాలన సాగిస్తూ తెలం గాణా ప్రజలను బానిసలుగా వేధిస్తున్న రజాకర్ల అకృత్యాలతో ప్రజలు తల్లడి ల్లారు. వారి ఆగడాలకు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎదురుతిరిగి ధాన్యంలేవిని బహిష్కరించి కప్పం చెల్లింపులను బహిష్కరించి సాయుధ పోరాటాలు జరిపారు. మరోపక్క మహా రాష్ట్ర చానకాలలో నిజాం వ్యతిరేక పోరాట శిభిరాలు, లాఠీల శిక్షణ పొందారు. కాసిం రజ్వికి ఎదురుతిరిగి వారి లాఠా దెబ్బలకు గురై జైల్లపాలయ్యారు. ప్రజల్లో ఉప్పెనలా వచ్చిన ఉద్యమంతో పాటు భారత ప్రభుత్వ సైన్యం తో నిజాం రాజు దిగిరాకతప్పలేదు. 1948సెప్టెంబర్ 17న భారత ప్రభు త్వంతో తెలంగాణా ప్రాంతాన్ని విలీనం చేశారునవాబులు, ఈపోరు లో కొందరు కీర్తిశేషులు కాగా ఆనాటి నుండి జ్ఞాపకాలను స్మరించు కుంటున్నారు. 26మందికి పైగా స్వాతంత్ర్య సమర యోధులు చరిత్ర పుటల్లోకి చిక్కగా మరికొందరు కాల గర్భంలో కలిసిపో యిన వారు మరెందరో, వెంకట్ రావ్, రాజారెడ్డి, శంకర్‌రావ్, గుండెరావ్, లక్ష్మణ్ రావ్ సూర్య, నానాజి, లక్ష్మణ్ సింగ్, శంకర్ సింగ్, సంగడి నడిపెన్న, ఆనంద్‌బాయి యార్లరెడ్డి, ప్రభాకర్ రావ్, దేవిదాస్ రావ్, గంగారాం, లింగా రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాజన్న, మల్లా రెడ్డి తదితరులు నిజాం పోరాటంలో పాల్గొని చరిత్ర పుటల్లోకి ఎక్కగా మరికొందరు గుం డెరావ్, వెంకట్‌రావ్‌లకు స్వతంత్ర్య పోరాటంలో త్యాగాలను గుర్తించి వారికి భారత స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ అందించారు. పోరా టంలో పాల్గొన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసింది. ఇప్పటి వరకు కూడ కొందరు సమరయోధులకు పెన్షన్ అందలేకపో తుంది. వారుకళ్ల ముందు లేక పోయిన ఆదర్శన జ్ఞాపకాలు బోథ్ ప్రాంతీయులకు స్పూర్తి దాయ కాలు. అందుకే బోథ్ నియోజక వర్గ ప్రాంతం పోరాటాల గడ్డగా రాజు కెక్కింది. భూసం స్కరణ అమలు, నక్సల్స్ పోరాటాలు, పంటలకు గిట్టుబాటు ధరలు, సంఘ టిత, అసం ఘటిత కార్మికుల సమస్యలు, బీడీ కార్మి కుల సమస్యలు మరెన్నెన్నో ప్రజా పోరాటాలు సల్పిన గణత బోథ్ అమర వీరులకు దక్కింది. బోథ్ ప్రాంతీయులు అమరవీరుల ఆశయసా ధనకై వారి అడుగుజాడల్లో ముందుకు సాగుతూ సెప్టెంబర్ 17న తెలంగాణా విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

# వీరులారా వందనం



నిజాం పాలన విముక్తి పోరాటంలో ఆసిఫాబాద్ ప్రాంత సమర యోధుల పోరాటం మరువలేనిది. ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన పలువురు మహారాష్ట్రలోని చంద్రాపూర్ మిటలరీ శిక్షణ క్యాంపులో చేరి సాయుధ శిక్షణను పొందారు. మిలటరీ పంజాబ్ రేజిమెంట్ లేజర్ పీఎస్ గహున్ శిక్షణను అందించారు. అక్కడ క్యాంపు ఇన్‌చార్జి గోపాల్ శాస్త్రి బేకర్, బల్లార్షా క్యాంపు ఇన్‌చార్జిగా కేవీ కేశవులు వ్యవహరించగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ క్యాంపులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన చీల శంకర్, చీల విఠల్, కాంద్రె శంకర్, చందన్‌వార్ విఠల్, జగన్నాథ్, రేవయ్య, రాంసింగ్, నాగేంద్రయ్య, తిరుపతి, వెంకటేశంలు సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందుతూ సాయుధ పోరాటాన్ని నిర్వహించారు.

**జిల్లా కేంద్రంగా ఆసిఫాబాద్..**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా 1940 వరకు కొనసాగింది. ఈ సమయంలో పలువురు బ్రిటీష్ పాలన వ్యతిరేక పోరాటం, వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాలు, హిందీ మహాసభ ప్రచారం జరిపి జైలు జీవితం అనుభవించిన స్ఫూర్తితో 1947 నుంచి 1948 సంవత్సరాల్లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాటం చేసేందుకు బీజం పోసింది. ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి చీల శంకర్, చీల విఠల్, రాంసింగ్, కాంద్రె శంకర్, రేవయ్య, నాగేంద్రయ్య, బోనగిరి వెంకటేశం, చందావార్ విఠల్, కాటెపల్లి తిరుపతి, జగన్నాథ్‌లు అజ్ఞాతంలోకి వెల్లి మహారాష్ట్రలోని చాందలో నిర్వహించిన సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది కాలం పాటు శిక్షణ పొందుతూ వివిధ సంఘటనల్లో పాల్గొన్నారు. భారత సైనిక దళాలకు అండగా ఉంటూ ప్రాణాలకు తెగించి రణరంగంలో దూకిన ఆసిఫాబాద్ సమరయోధులు నిజాం లొంగు బాటుకు దరూర్ రైల్వే స్టేషన్ విధ్వంసం చేసిన సంఘటనలో పాల్గొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపేందుకు అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆదేశాలతో 13.09.1948 పోలీసు యాక్షన్ ప్రకటితమైంది. మహారాష్ట్ర సైనిక దళాలు చాందా, బల్లార్షా క్యాంపుల్లో సుక్షితులైన ఆసిఫాబాద్ యోధులు రజాకార్లను మట్టుపెట్టేందుకు ముందుకు సాగారు. ఈ పోరాటం హెూరాహెూరిగా జరిగింది. సెప్టెంబర్ 14న బల్లార్షా సాస్రి ప్రాంతంలో జరిగిన పోరాటంలో 10 మంది నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు మరణించారు. సెప్టెంబర్ 15న సైనిక దళాలు మాణిక్‌ఘడ్ పోలీసు అవుట్ పోస్టుపై దాడి చేశారు. సెప్టెంబర్ 16న సిర్పూర్, బెజ్జూరు అవుట్ పోస్టులు భారత సైనిక పరమయ్యాయి. సెప్టెంబర్ 17న నిజాం సర్కార్ సైన్యానికి తలొగ్గి హైదరాబాద్ సంస్థాన్ భారత్‌లో విలీనం అయింది. సెప్టెంబర్ 18న ఆసిఫాబాద్ జిల్లా జైలులోని 200 మంది ఖైదీలు గేట్లు విరగొట్టుకుని బయటకు వచ్చారు. నిజాం ప్రభుత్వాన్ని భారత దేశ సంస్థానంలో విలీనం చేసేందుకు ఆసిఫాబాద్ సమరయోధుల కృషి ఎంతో ఉంది.

**దోపిడీ వ్యవస్థ..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాడు నిజాం నిలువు దోపిడీ వ్యవస్థ కొనసాగింది. రజాకార్ల అరాచకాలు పరాకాష్టకు చేరాయి. అరకపట్టి, మంచెపట్టి, బంచరాయి లాంటి పన్నులతో గిరిజన రైతులను దోచుకున్నారు. అడవి బిడ్డలకు అడవిపై హక్కులు లేవన్నారు. ఈ నేపథ్యంలో సాయుధ పోరుకు దిగిన కుమరం భీం నిజాంపై విరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. జిల్లా గిరిజనుల్లో పోరాట స్ఫూర్తి నింపారు. గిరిజన హక్కుల కోసం తిరుగుబాటు నేర్పారు. భీం పోరాట స్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో వం దలాది మంది యువకులు నిజాంపై తుపాకీ ఎక్కు పెట్టారు. జిల్లాలో గిరిజన హక్కుల పోరాటం, భారత స్వాతంత్ర్య పోరాటం, ప్రత్యేక తెలంగాణ పోరాటం చరిత్రలో ప్రముఖంగా నిలిచాయి. గొప్ప పోరాట నేపథ్యం ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య పోరాటంలో హైదరాబాద్ విలీనం పోలీసు యాక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీతో పాటు వందలాది మంది సమరయోధులు పోరాడి భావితరానికి స్ఫూర్తిగా నిలిచారు.

**బాపూజీ కల సాకారం..**

భారత స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు నిజాం నిరంకుశత్వం నుంచి హైదరాబాద్ విలీన సాయుధ పోరులో కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రముఖ పాత్ర పోషించారు. పోరాట యోధుడు, ఆసిఫాబాద్ ప్రథమ శాసన సభ్యుడు కొండాలక్ష్మణ్ బాపూజీ ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని వాంకిడిలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారు. ఆసిఫాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని రాజురాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని సిటీ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అక్కడే డిప్లొమా లా కోర్సులో చేరి 1945లో పూర్తి స్థాయి లా పట్టాను పొందారు. హైకోర్టు న్యాయవాదిగా పని చేశారు. 1952లో ఆసిఫాబాద్ నియోజక వర్గం నుంచి జనరల్ కోటా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య పోరు, నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి జరిగిన పోరాటంలో ప్రముఖ పాత్ర పోశించిన వారిలో కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యుడు. 1969 నుంచి కొనసాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. 2008 నవంబర్‌లో ఆయన ప్రత్యేక తెలంగాణను తమకు తాము ప్రకటించుకొంటామని సంచలన ప్రకటన చేశారు. 2009 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ సాయుధ సమితిని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాజకీయ జేఏసీ, టీఆర్‌ఎస్‌లతో ఇతర రాజకీయ పార్టీల విధానాలతో ఆయన విభేధించారు. నవ తెలంగాణ ప్రజాపార్టీని ప్రకటించారు. 96 ఏళ్ల వయస్సులోనూ ప్రత్యేక తెలంగాణ కోసం ఆయన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్షకు కూ ర్చుకున్నారు. 2012 సెప్టెంబరు 22న ఆయన మరణించే వరకు తెలంగాణ సాధన కోసం కృషి చేశారు.

**ప్రజాపాలన దినోత్సవంగా..**

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17 తెలంగాణ విమో చన దినోత్సవాన్ని తెలంగాణ ప్రజాపాలన దినోత్స వంగా పరిగణిస్తూ వేడుకలను నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రజాపాలన దినోత్సతవాన్ని నిర్వహించేందుకు అధికారులు కలెక్టరేట్‌లో ఏర్పాటు పూర్తి చేశారు. జిల్లాకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు హేమలత అగర్వాల్



ఇచ్చోడ, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను... రాష్ట్ర మహిళ మరియు బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు హేమలత అగర్వాల్ సందర్శించారు... పాఠశాలలోని తరగతి గదులను, పాఠశాల మైదానాన్ని పరిశీలించారు.. విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుంది కావున చక్కగా చదువుకొని ఉజ్వలమైన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని.... మీ తల్లిదండ్రులు ఇప్పుడు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని.. మీరు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులను చక్కగా కాపాడుకోవాలని, సమాజానికి మార్గదర్శకులుగా కావాలని.. మీకేమైనా సమస్యలుంటే 1098 కి నిరంతరంగా ఫోన్ చేసి చెప్పవచ్చు అని అన్నారు.. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ .. మధ్యాహ్న భోజనం బిల్లులు రాకపోవడం వల్ల అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాల ఇదే కావడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న యూనిఫామ్ కుట్టడానికి ప్రభుత్వం నుండి 100 రూపాయలు ఇవ్వడంతో... విద్యార్థిని విద్యార్థులకు యూనిఫామ్‌లు కుదరడం లేవని...కాబట్టి బయట మార్కెట్లో దర్జీలకు యూనిఫామ్ లు కుట్టడానికి 300,400 ఉందని.. మహిళ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు కు వివరించారు.. ఈ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని ప్రజల ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు ఆమె తెలిపారు.. పాఠశాలను పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, బాలల హక్కుల పరిరక్షణ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మధురవాణి , సెక్టోరియల్ తిరుపతి, సోషల్ వర్కర్ రవికాంత్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతి ఖనిని సందర్శించిన జీఎం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని శాంతిఖని ప్రాజెక్టును మందమర్రి జీఎం రాధకృష్ణ సందర్శించారు. జనరల్ తనిఖీలో భాగంగా మంగళవారం శాంతిఖని మైనును జీఎం రాధ కృష్ణ సందర్శించారు. మొదటిషిఫ్ట్‌లో అండర్ గ్రౌండ్‌లో దిగి పని స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, అధికారులు అండర్ గ్రౌండ్ విసిటింగ్‌లో పాల్గొన్నారు.

## పత్తి పంట సాగుపై అవగాహన

బెజ్జూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
మండలంలోని కుకుడా గ్రామంలో పత్తి పంట సాగు విధానంపై రైతులకు మండల వ్యవసాయ అధికారి నాగరాజు అవగాహన కల్పించారు. రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వలన పత్తి పంటలో వచ్చే గులాబి రంగు పురుగును, అన్ని రకాల పంటలో వచ్చే పురుగుల సంతానోత్పత్తి అరికట్టవచ్చును దీనివలన వాటి ఉధృతి తగ్గుతుందని సంరక్షణ చర్యలో భాగంగా లింగ ఆకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ అధికారి నాగరాజు సలహాలు సూచనలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మారుతి, ఆదర్శ రైతు జగదీష్, మ్యాన్కైండ్ అగ్రిటెక్ ఎండిఏ కమలాకర్, రైతులు పాల్గొన్నారు.



# యాత్ర ఆనందం సద్వినియోగం చేసుకోండి



నిర్మల్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
టీజీ ఆర్టీసీ ఆధ్వర్యంలో భక్తుల సందర్శకుల ప్రయోజనం కోసం యాత్రానందం బస్ సర్వీస్ లను ఏర్పాటు చేయడం జరిగిందని నిర్మల్ డిపో పండరీ తెలిపారు. మంగళవారం నిర్మల్ డిపో నుండి యాత్రానందంలో భాగంగా అరు ణాచలం తిరుపతి రామేశ్వరానికి బస్ సర్వీస్ ను ప్రారంభించారు. 35 మంది భక్తులు ఎక్కి డికి వెళ్లాలన్నా వారికి బస్సు సౌకర్యం ఉంటుం దని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు.ఆర్.రెడ్డి రమణ భక్తులు పాల్గొన్నారు.

# కోలిండియా స్థాయి పోటీల్లో రాణించాలి



మందమర్రి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
సింగరేణి కార్మిక క్రీడాకారులు ఏరియా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించి సింగరేణి కీర్తిని కోల్ ఇండియాలో చాటాలని ఏరియా ఎస్ఓటూ జీఎం విజయ ప్రసాద్ కోరారు. ఏరియా లోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో మంగళవారం వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 61 వ వార్షిక క్రీడోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి కార్మిక క్రీడాకారులు, కళాకారులు కోల్ ఇండియా స్థాయి పోటీలలో రాణించి ప్రతి సంవత్సరం అనేక బహుమతులు సాధిస్తున్నారన్నారు. ఏరియా క్రీడాకారులు కోల్ ఇండియా పోటీలకు ఎంపికై పతకాలు సాధించి సింగరేణికి, ఏరియా కు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు. సీనియర్ క్రీడాకారులు సంస్థలో పనిచేస్తున్న యువ ఉద్యోగులను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి ఉపయోగ పడతాయని, సింగరేణి యాజమాన్యం కార్మిక క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**కబడ్డీ విజేత గ్రూప్-3..**
ఏరియా స్థాయి కబడ్డీ పోటీల్లో 3 గ్రూపులు తలపడగా గ్రూప్ 3 జట్టు విజయం సాధించింది. కాసిపేట 1,శాంతి ఖని గనుల క్రీడాకారులు గ్రూప్ 1 జట్టు గా, కేకే-5, కేకే ఓసి, ఆర్కే ఓసి జీఎం ఆఫీస్ క్రీడాకారులు గ్రూప్ 2 జట్టుగా, కాసిపేట 2, ఎస్అండ్ పిసి, ఆర్కేపి సివిల్, ఏరియా స్టోర్స్, సిహెచ్పి, సివిల్ క్రీడాకారులు గ్రూప్ 3 జట్టుగా పోటీ పడ్డారు. హోరాహోరిగా సాగిన పోటీల్లో గ్రూప్ 3 జట్టు విజేతగా నిలువగా, గ్రూప్-1 జట్టు రన్నర్స్‌గా నిలిచింది.



## ఓజోన్‌ని కాపాడుకుందాం

# భూమిని రక్షించుకుందాం

ఇచ్చోడ, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆది శ్రీనివాస్ ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యతను, దాని క్షీణత వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సమన్వయకర్త డాక్టర్ సరిత రాణి ఓజోన్ పొరను పరిరక్షించాలంటే క్లోరో ఫ్లోరో కార్బన్స్, కార్బన్మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్ వంటి ఉద్గారాలను తగ్గించడంతోపాటు, మొక్కలను నాటడం, పునరుత్పాదక శక్తి వనరుల ఉపయోగం భవిష్యత్తు తరాలను కాపాడుతుందన్నారు. ఓజోన్ పొరను మనం రక్షిస్తే అది భూమిమీద నివసించే జీవరాశులను రక్షిస్తుందని కనుక భావి భారత పౌరులైన మీరందరూ ప్రతిన బూని ఓజోన్‌ని రక్షించాలని పిలుపునిచ్చారు. మన భూమి నుంచి 19 మైళ్ళ ఎత్తులో ఓజోన్ పొర ఉందని,ఇది భూమిపై నివసించే మానవాళి, ఇతర జీవరాశుల మనుగడకు ఎంతో కీలకమని ఓజోన్ అంటే.. 3 ఆక్సిజన్ పరమాణువులు కలిస్తే ఏర్పడే మూలకమని సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమి మీద పడకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందని ఒకవేళ ఓజోన్ పొర అడ్డుగా లేకపోతే.. సూర్యుడి కిరణాలు నేరుగా మనుషుల మీద పడి చర్మ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను కలిగిస్తాయని,కాలుష్య ఉద్గారాలు, ఏసీ వాడకం వల్ల వెలువడే ఉద్గారాల కారణంగా ఓజోన్ పొర దెబ్బతింటోందని ఇప్పటికే ఓజోన్ పొర క్షీణిస్తోందని పర్యావరణ శాస్త్రవేత్తలు 1982లో గుర్తించారని ఇలాంటి పరిస్థితులే కొనసాగిస్తే భవిష్యత్తులో జీవకోటికి పెద్ద ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని గమనించిన ఐక్యరాజ్యసమితి, ఓజోన్ సంరక్షణ కోసం ప్రపంచ దేశాలను ఏకం చేసింది. తొలిసారిగా 1987లో 24 దేశాల ప్రతినిధులు కెనడాలోని మాంట్రియల్‌లో ఓజోన్ పొర క్షీణిస్తున్న భయంకరమైన పరిస్థితిపై చర్చించేందుకు సమావేశమయ్యారని ఓజోన్ పొర క్షీణతను అరికట్టాలని తీర్మానించాయని అప్పటి నుంచే.. ప్రతి సంవత్సరం అదే రోజున అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నాము కనుక మీరందరూ భాధ్యతగా మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరస్వతి, డాక్టర్ మధు, డాక్టర్ అనిత, ప్రభాత్ రావు, దయాకర్ ,విజయకుమార్, డాక్టర్ తిరుపతి, సుభాష్, బాలకృష్ణ, విజయలక్ష్మి మరియు కార్యక్రమం యొక్క సమన్వయకర్త సరిత రాణి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ఎదగాలి



ఇచ్చోడ, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ఎదగాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లె పూల నర్సయ్య అన్నారు. మున్నూరు కాపులు హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు. మండల కేంద్రమైన ఇచ్చోడలో మంగళవారం మున్నూరు కాపు మండల శాఖ తరుపున స్థానిక భవనంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ తో పాటు, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ మాజీ ఎంపీటీసీ, సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ లకు శాలువాలు, పూల మాలతో ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థగత ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, మన మున్నూరు కాపులు ఏ పార్టీలో ఉన్నా కలిసి కట్టుగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు కు మద్దతు ఇవ్వాలన్నారు. స్థానిక ఎన్నికల్లో మున్నూ రు కాపులు సత్తా చాటాలని, దానికి గాను కృషి చేయాలన్నారు. మున్నూరుకాపులు వ్యవసాయం, విద్య, రాజకీయ, ఉపాధి, వ్యాపారంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్పష్టం చేశారు. అనంతరం బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ మాజీ ఎంపీటీసీ, సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ మాట్లాడారు. ఇచ్చోడలో సంఘ భవనం నిర్మాణం, రూ 20 లక్షల నిధుల మంజూరు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో ఇచ్చోడ, గేర్జం, కోకస్ మన్నూర్, మాదాపూర్ గ్రామాలకు చెందిన అధ్యక్షులు, అయిద రాజేశ్వర్, జుర్రేవార్ దీపక్, కాండ్లి విశ్వనాథ్, సుధాకర్, అంగ రాజేశ్వర్, నరాల రమణయ్య, దేశెట్టి రాజేశ్వర్, మల్లికార్జున్, బలుగురి గంగయ్య, సిద్దిరి దత్తు, బలగం రవి, ఆసం మనోహర్, సిద్దవార్ వెంకటేష్, చందు, కొండ హరి ప్రసాద్, ముప్పిటి శంకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాన్వీ గులాబీ మెరుపులు


బాలీవుడ్ బ్యూటీ జాన్వీ ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో స్టన్నింగ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటోంది. తాజాగా పెంక్ డ్రెస్ లో జాన్వీ లుక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. నటి జాన్వీ కపూర్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. ఇటీవలే 'పరమ్ సుందరి' సినిమాతో అలరించిన ఈ బ్యూటీ ఇప్పుడు 'సన్నీ కా సంస్కారీ' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదల చేయగా సోషల్ మీడియాలో సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది. వరుణ్ దావణ్, జాన్వీ జంటగా నటించిన ఈ చిత్రం అక్టోబర్ 2న థియేటర్స్ లో విడుదల కానుంది. ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో స్టన్నింగ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటోంది జాన్వీ. తాజాగా పింక్ లెహంగాలో జాన్వీ అందాల మెరుపులు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. జాన్వీ తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ పిక్స్ నెట్టింట వైరల్ అవడంతో.. ఇవి చూసిన ఫ్యాన్స్ పిక్స్ పై లైకుల వర్షం కురిపిస్తున్నారు. హిందీతో పాటు తెలుగులోనూ సత్తా చాటుతోంది జాన్వీ. ఇప్పటికే తెలుగులో ntr జోడీగా దేవర సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో నటిస్తోంది.



## "OG" ప్రీ-రిలీజ్ ఈవెంట్ డేట్ అండ్ ప్లేస్ ఫిక్స్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, సుజీత్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ 'OG' సినిమా ఈ నెల 25 సెప్టెంబర్ 2025న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో భారీ క్రేజ్ ఉంది. పోస్టర్లు, పాటలు, గ్లింప్స్ అన్నింటికీ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఐతే అభిమానులకు కోసం మేకర్స్ సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ప్రీ-రిలీజ్ ఈవెంట్ ను భారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌ను ఈ నెల 21న, హైదరాబాద్ లో యూసఫ్ గూడా పోలీస్ గ్రౌండ్స్ వద్ద నిర్వహించబోతున్నారాణి తెలుస్తోంది. ఈ వేడుకకు పవన్ కళ్యాణ్ తప్పకుండా హాజరవుతారు. అలాగే, విలన్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ నటి ఇమ్రాన్ హష్మీ కూడా పాల్గొనబోతున్నట్టు సమాచారం. టాలీవుడ్ నుండి డైరెక్టర్ త్రివిక్రమ్ కూడా ఈ ఈవెంట్ కు హాజరు కానున్నారు.అంతేకాదు... హైదరాబాద్ లో జరిగే ఈ ప్రీ-రిలీజ్ వేడుకతో పాటు ఆంధ్రప్రదేశ్ లో కూడా మరో ఈవెంట్ నిర్వహించాలనే ప్లాన్ ఉంది. అయితే విజయవాడ లేదా విశాఖపట్నం పరిశీలిస్తున్నట్టు సమాచారం. అనుమతులు ఇంకా రావాల్సి ఉంది."OG"లో హీరోయిన్ గా ప్రియాంకా మోహన్ నటిస్తున్నారు. విలన్ పాత్రలో ఇమ్రాన్ హష్మీ కనిపించనున్నాడు. మ్యూజిక్ థమన్ ఎస్. ఈ సినిమాకు మాస్ సంగీతం అందిస్తున్నాడు.

## 'మదరాసి' ఓటీటీ ఫిక్స్..!



శివకార్తికేయన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'మదరాసి' ఇటీవలే నవంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రుక్మిణి వసంత్ కథానాయికగా నటించిన ఈ చిత్రంపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. శివకార్తికేయన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'మదరాసి' ఇటీవలే నవంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రుక్మిణి వసంత్ కథానాయికగా నటించిన ఈ చిత్రంపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమిళనాడులో ఈ చిత్రం కమర్షియల్ గా కొత్త వరకు రాణించినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్ల పరంగా మూవీ తేలిపోయింది. దాదాపు రూ. 91 కోట్ల గ్రాస్ మాత్రమే వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో కొనుగోలు చేసింది. థియేటర్ రన్ ముగించుకొని త్వరలో అక్టోబర్ 3 నుండి ఈ సినిమా ప్రైమ్ లో స్ట్రీమ్ అవుతుంది అని సమాచారం. తమిళ్, తెలుగు సహా పాన్-ఇండియా భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. శివకార్తికేయన్ - మురుగదాస్ కాంబో లో తెరకెక్కిన ఈ మూవీ థియేటర్లలో మిస్ అయినవారికి ఇప్పుడు ఓటీటీలో చూసే అవకాశం దక్కింది.



## og భామ ఆన్ డ్యూటీ

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడెక్కడ చూసిన ఒకటే మాట. ఓజి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన సినిమానే ఓజి. ఫ్యాన్ బాయ్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టే రిలీజైన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ కూడా ఉండటంతో ఓజిపై రోజు రోజుకీ అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమా సెప్టెంబర్ 25న రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా కోసం పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఓజి సినిమా చూస్తామా అని ఫ్యాన్స్ ఎగ్జైటింగ్ గా ఉన్నారు. రిలీజ్ కు మరో తొమ్మిది రోజులే ఉన్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను మొదలుపెట్టింది.ప్రమోషన్స్ లో భాగంగానే హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ తో మీడియాకు ఇంటర్వ్యూలిప్పిస్తూ సినిమా గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడిస్తూ ఓజిపై హైప్ ను పెంచుతున్నారు మేకర్స్. పవన్ తో ప్రియాంక చేస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ సినిమా కోసం ఆమె కూడా ఎంతో ఎగ్జైటింగ్ గా వెయిట్ చేస్తున్నారు. అయితే ఈ ప్రమోషన్స్ లో ప్రియాంక పవన్ ఫ్యాన్స్ కు ఓ బ్యాడ్ న్యూస్ ను చెప్పారు.రీసెంట్ గా టాలీవుడ్ లో సినిమా రిలీజ్ కు ఓ రోజు ముందు గానే ప్రీమియర్స్ వేసే ట్రెండ్ మొదలవగా, ఓజికి కూడా అలానే తెలుగు రాష్ట్రాల్లో స్పెషల్ ప్రీమియర్లు వేస్తే బావుంటుందని ఫ్యాన్స్ భావించారు. కానీ ఓజి ఇంటర్వ్యూల్లో భాగంగా మేకర్స్ అలాంటివేమీ ఉండవని క్లారిటీ ఇచ్చారు. కాకపోతే సెప్టెంబర్ 25 అర్ధరాత్రి 1 గంటకు, వేకువఝామున 4 గంటలకు బెనిఫిట్ షో లను వేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. ఆల్రెడీ ఓజిపై భారీ హైప్ ఉన్నందున మేకర్స్ ఈ సినిమాకు వేరే భాషల్లో ప్రమోషన్స్ చేస్తారో లేదో చూడాలి. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.

# ప్రాణహితను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే



**కౌటాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
ప్రాణహితను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే అని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత ప్రాజెక్టు ప్రారంభించకపోతే వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్సీ దండే విఠల్ ఇటీవల ప్రకటించటంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపనమ్మకం వస్తోందని అన్నారు. 2008లోనే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించినట్టు కొత్తగా ఇప్పుడు ప్రారంభించేది ఏమీ లేదన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు దోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు విజయ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్ములే మల్లయ్య, నీరటి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కొరకు దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా 4వ బ్యాచ్ ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందించడం కొరకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని టాస్క్ ఆర్.సి. మేనేజర్ జి.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా సి, సిం, హెచ్.టి.ఎం.ఎల్. సి.ఎస్.ఎస్. జావా స్క్రిప్ట్, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఇంటర్వ్యూ నైపుణ్యాలు, బూట్ స్ట్రాప్, వెబ్ డెవలప్మెంట్ కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థుల వయస్సు 18-33 సంవత్సరాల మధ్య ఉండాలని, కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్ తో కూడిన డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ నుండి 27వ తేదీలోగా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9502786438 నెంబర్‌లో ఆన్‌లైన్‌లోhttps://shorturl.at/z2m4Hలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు రాజారాం నేత్రాలు దానం..!



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలం రవీంద్రనగర్‌లో మంగళవారం ఎద్దు దాడిలో మృతి చెందిన జంగపల్లి రాజారాం కళ్ళను దానం చేసేందుకు అతని కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. పుట్టెడు దుఃఖంలోనూ కుటుంబ సభ్యులు ఈ గొప్ప నిర్ణయాన్ని తీసుకోవడం అభినందనీయం.మృతుని అల్లుడు, జనహిత సేవాసమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి కుటుంబ సభ్యులను అంగీకరించేలా ప్రయత్నించి సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ సహకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు నేత్రాలను అందించారు. ఈ సందర్భంగా జనహిత సేవాసమితి అధ్యక్షులు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జంగపల్లి రాజారాం కుటుంబ సభ్యులకు ప్రజలు మరణించిన తర్వాత తమ శరీర భాగాలు బూడిదై వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. మరణించిన ఎనిమిది గంటలలోపు కళ్ళలోని కార్నియాపూర్ అని మాత్రమే సేకరిస్తారని, నేత్ర దానం ద్వారా మరణించినా ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉంటుందని తెలిపారు. శరీర భాగాలు వైద్య కళాశాలకు అందిస్తే వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడతాయన్నారు. ప్రజలు అపోహలు మాని నేత్ర, అవయవ, శరీర దళానికి ముందుకు రావాలని కోరారు. జనహిత సేవాసమితి ప్రధాన కార్యదర్శి ఇప్పరవి గతంలో తన తల్లి నేత్రాలను, ప్రస్తుతం మామ రాజారాం నేత్రాలను దానం చేసేందుకు కృషిచేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ



**కౌటాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
కౌటాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈరోజు కౌటాల మండలానికి చెందిన 68 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో లబ్ధిదారులు సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని, దసరా రోజున ఇంటికి ముగ్గు పోసుకోవాలని , ఎండాకాలం వచ్చేలోపు శాశ్వత గృహ నిర్మాణం జరిగి తీరాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, ఎమ్మార్వో ప్రమోద్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రేమలత, హౌసింగ్ ఏఈ షుజా ఉద్దీన్, డా.పవన్ కళ్యాణ్ రెడ్డి, ఆర్ఐ దేవేందర్, పంచాయతీ సెక్రటరీ సాయికృష్ణ, భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ మండల అధ్యక్షులు వాను పటేల్, మాజీ జడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి దుర్గం మోతిరాం లబ్ధిదారులు పాల్గొన్నారు.



### మాల మహానాడు ఆధ్వర్యంలో
## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**జన్నారం, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దాముక కమలాకర్‌ను జన్నారం మండల మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు



**బెజ్జూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షానికి ఇల్లు కూలిపోయింది. రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ తరుణంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన మహంకాళి కుమార్ నివాస గృహం భారీ వర్షానికి ధ్వంసం అయింది. రేకులు వేసుకుని నివసిస్తున్న ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని
## వేగవంతం చేయాలి



**మామడ, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీఓ ఉపేందర్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి దశలవారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. మంజూరైన ఇండ్లు కనీసం బేస్మెంట్ లెవల్‌కి చేరాలని, ఏవైనా సమస్యలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీఓ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన దినోత్సవం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా పరిగణిస్తూ వేడుకలను నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రజా పాలన దినోత్సతవాన్ని నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా అధికారులు కలెక్టరేట్‌లో ఏర్పాటు పూర్తి చేశారు.



### కాగజ్‌నగర్‌లో మరిన్ని
## ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. పాటలీ పుత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు కాగజ్‌నగర్‌లో మంగళవారం రైల్వే అధికారులు హాల్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టింగ్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రైల్ సేవా సమితి అధ్యక్షులు ప్రయాగ్ తివారి, పవన్ బల్దువా, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, మాజీ జడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలుపదాసు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో పలువురి చేరిక

**కౌటాల, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**
కౌటాల మండలంలోని గురుడుపేట గ్రామపంచాయతీ పరిధిలో గల యాపలగూడ గ్రామంలో మంగళవారం రోజు కాంగ్రెస్, బిఆర్ఎస్ నుంచి భాజపాలో చప్పిడి పాపయ్య ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, గ్రామస్తులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యాపలగూడలో నూతన ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని, అలాగే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ని కొరవడం జరిగింది. భాజపాలో చేరిన వారిలో లస్మయ్య, దామోదర్, జలపతి, ప్రసాద్, కమలాకర్, శంకర్, మహేష్, రాజారాం, జనార్ధన్, పురుషోత్తం, చిన్నయ్య, శాంత, వందన, తారబాయి, లక్ష్మి, ఈశ్వరి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్యామల, మేకల తిరుపతి, మధుకర్, భూమయ్య, రావుజి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.





## చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా..

ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా సీతాగొంది జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేరళ నుండి మహారాష్ట్రలోని నాగపూర్ కు చేపల లోడ్ తో వెళ్తున్న లారీ మంగళవారం గుడిహత్నూర్ మండలం సీతాగొంది జాతీయ రహదారిపై లారీ టైరు పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అబ్బు తాయర్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని రిమ్స్‌కు తరలించారు.

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
జిల్లా కేంద్రంలోని బాలికల హాస్టల్ వద్ద అనుమానస్పదంగా ఇద్దరి యువకులు తిరుగుతుండడంతో పాటు ప్రహరీ గోడ ఎక్కే ప్రయత్నం చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్న షీ టీం ఇంచార్జీ ఎస్సై బిక్కులాల్ యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎవరైనా యువకులు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని వార్నింగ్ ఇచ్చారు. బాలికల వసతి గృహాల వద్ద భద్రత ఏర్పాటు చేసుకోవాలని, విద్యార్థినిలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు, విద్యార్థినిలకు, యువతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 8712670564/65 లేదా 100కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్వప్న, రజని ,దినేష్ పాల్గొన్నారు.

## బావిలో దూకి ఆత్మహత్య

మందమర్రి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)



దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను భరించలేక వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దీపక్ నగర్‌లో నివాసముండే పిట్టల లక్ష్మీ(65) తన ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు గత కొద్ది రోజులుగా కిడ్నీకి సంబంధించిన వ్యాధితో పాటు, బిపి, షుగర్, వంటి వ్యాధులతో బాధపడుతుందని మందులు వాడినప్పటికీ వ్యాధి తగ్గకపోగా, గతంలో తన పెద్ద కుమారుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడని, ఒకవైపు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, మరోవైపు కొడుకు మరణంతో మానసిక వేదనకు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# వివిధ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
క్యాతనపల్లి పురపాలకం రామకృష్ణాపూర్ పట్టణంలో కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పుర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై నిర్వహించే సమీక్షకు తహశీల్దార్ సతీష్, పుర కమిషనర్ రాజు, ఏఈ, విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఆయా శాఖలలో పెండింగ్లో ఉన్న పనుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి పట్టణ సమస్యల గుర్చి కార్యకర్తలను అడుగగా వార్డుల వారిగా కాలనీల్లో ఉన్న సమస్యలను వ్రాసి అందజేశారు.

**కమిషన్ల కోసమే అభివృద్ధి పనులు...**
మందమర్రి వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, కూరగాయల మార్కెట్ కోసం 20 కోట్లతో నిర్మాణం, కేటీఆర్ పార్క్ వంటి భారీ ప్రభుత్వ నిర్మాణాలను గత ప్రభుత్వం చేపట్టిందని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. మన వారిలో ఆయన మాట్లాడుతూ, కేవలం కమిషన్ల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## 16 మంది పీఏసీఎస్ చైర్మన్ల తొలగింపు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 16 పీఏసీఎస్ చైర్మన్లను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. ఆదిలాబాద్ జిల్లాలో ఐదుగురు, మంచిర్యాల జిల్లాలో 11 మందిని తొలగించారని తెలిసింది. ఈ మేరకు ఉత్తర్వులు సైతం జారీ అయినట్లు సమాచారం. ఒకేసారి ఇంత మందిని తొలగించడం సంచలనం కలిగిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు పీఏసీఎస్ చైర్మన్లు... కుమారి, ముఖ్రా, నర్సాపూర్, జాబిడి, మాన్కాపూర్, మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, కోటపల్లి, భీమిని, జెండా వెంకటాపూర్, నెన్నె వెంకటాపూర్, పద్దన్ పల్లి, గూడెం, ఇటిక్యాల్, జైపూర్, నెన్నెల, మందమర్రి చైర్మన్లను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దాదాపు పది అంశాల్లో విచారణ నిర్వహించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని చోట్ల యూరియా, వ్యవసాయ పరికరాలు పంపిణీలో అక్రమాలు పాల్పడ్డట్టు అధికారులు విచారణలో తేలినట్టు చెబుతున్నారు. ఇలా పది రకాల లోపాలను గుర్తించిన అధికారులు నివేదిక పంపడంతో వేటు వేసి, ఆయా సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను సైతం నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

## ఎద్దు దాడిలో వ్యక్తి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం రవీంద్ర నగర్‌కు చెందిన జంగంపల్లి రాజారాం(58) అనే వ్యక్తిని ఎద్దు పొడవడంతో మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బస్తీలోని రహదారిపై ఓ ఎద్దు ముకుతాడుతో ఇబ్బంది పడుతుండగా గమనించిన అతను ఎద్దు వద్దకు వెళ్లి తాడును సరి చేసే క్రమంలో కొమ్ములతో అతన్ని పొడిచింది. దీంతో ఛాతి భాగం పై కొమ్ము దిగి తీవ్ర గాయాలయ్యాయి. బెల్లంపల్లి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించే సమయంలో వ్యక్తి మృతి చెందారు. ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.





## బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృతి

సిరికొండ, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని వాయిపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని భీంపూర్‌లో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. భీంపూర్ గ్రామానికి చెందిన తొడసం ఏత్మ భాయి (20) 12వ తేదీ శుక్రవారం పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు ఆమెను ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఆమె బాలుడికి జన్మనిచ్చింది. 14వ తేదీన(ఆదివారం) డిశ్చార్జ్ అయిన ఆమె తలనొప్పి తీవ్రంగా ఉందని తెలుపగ వెంటనే కుటుంబ సభ్యులు 108 ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం సాయంత్రం మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

## అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

బోథ్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నామని బోథ్ ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రజ్వి, జవీద్ అనే ఇరువురు నిందితులు నాగపూర్ నుండి అక్రమంగా 33 ఎడ్లతో కూడిన లారీతో హైదరాబాద్ లోని శంషాబాద్‌కు తరలిస్తుండగా సొనాల మండలం లోని అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ అయినా ఘన్పూర్ చెక్ పోస్ట్ వద్ద బోథ్ పోలీసులు దాడి చేసి లారీని పట్టుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. పట్టుకున్న 33 ఎడ్లను ఇచ్చోడ లోని జైశ్రీరామ్ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

## ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య!

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఆసిఫాబాద్ మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన సుభాష్ (32) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ శివారులో తుమ్మచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నాయి.

## అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలకు చర్యలు తీసుకోండి



ఖానాపూర్, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)
ఖానాపూర్ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో నివసించే ప్రజల రవాణా కష్టాలు తొలగేలా స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి తగు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మంత్రి సీతక్క ను కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లో మంత్రి సీతక్క ను కలిసి వినతి పత్రం అందజేసి వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని ఉట్నూర్, పెంబి మండలాల్లో మొత్తం 6 బ్రిడ్జిల నిర్మాణానికి దాదాపు 17 కోట్ల 92 లక్షల రూపాయల వ్యయం అవుతుంది అని అంచనా వేసినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఏదైనా గ్రాంట్ ద్వారా ఆ మొత్తం నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క ను కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు హాజరయ్యేందుకు జిల్లాకు చేరుకున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ రావును నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై వాకబు చేశారు.










- మాజీల చేరికతో జిల్లాల్లో హస్తం బలపడేనా
- హస్తం గూటికి తిరుగుబాటు నేతలు
- సర్వత్రా ఆసక్తి రేపుతున్న మాజీ చేరిక
- జిల్లాలో 'చేతులు' కలిసేనా?
- ఇప్పటికే కాంగ్రెస్‌లో రెండు వర్గాలు
- స్థానిక ఎన్నికలకు ముందు మాజీల చేరిక
- గండ్రత్ సుజాత, సాజిద్ ఖాన్, సంజీవ రెడ్డి చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మీనాక్షి నటరాజన్
- కంది శ్రీనివాస్ రెడ్డికి షాక్
- హైకమాండ్ ఆదేశాలకు తలొగ్గిన 'కంది'
- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పీపీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఘర్ వాపసీ పాలిటిక్స్ సంచలనంగా మారుతోంది. ఇటీవల ప్రకటించినట్లుగానే కాంగ్రెస్ పార్టీ ఘర్ వాపసీ ప్రారంభించింది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ముగ్గురు నేతలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ టికెట్ ఆశించి భంగపడ్డారు. తమ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని ప్రకటించారు. కానీ అధిష్టానం మాత్రం కంది శ్రీనివాస్ రెడ్డికి టికెట్ కేటాయించింది. దీంతో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఈ ముగ్గురిలో సంజీవరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ విజయం సాధించగా బీఆర్ఎస్ అభ్యర్థి జోగురామన్న రెండో స్థానంలో, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి మూడో స్థానంలో నిలువగా సంజీవ్ రెడ్డి నాలుగో స్థానంలో నిలిచారు.

**నాడు కన్నీళ్లు.. హెచ్చరికలు..**

ఈ ముగ్గురు నేతలు 2023 నవంబర్‌లో కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఆసమయంలో నియోజకవర్గంలో ఎమోషనల్ అండ్ హై వోల్టేజ్ పాలిటిక్స్ నడిచాయి. పార్టీకి రాజీనామా చేస్తున్న సమయంలో సాజిద్ ఖాన్ కన్నీరు పెట్టుకున్నారు. తన కుటుంబం మొత్తం ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్‌లో పని చేస్తోందని ఇప్పుడు పార్టీ వీడాలంటే బాధగా ఉందంటూ భావోద్వేగానికి లోనయ్యారు. సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను కాదని కొత్తగా వచ్చిన ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న కంది శ్రీనివాస్ రెడ్డికి అధిష్టానం టికెట్ ఇచ్చిందని ఆవేదన చెందారు. ఇక తనపై కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరూపించకపోతే చెప్పుతో కొడతానంటూ గండ్రత్ సుజాత చేసిన హెచ్చరికలు తీవ్ర కలకలం రేపాయి. పబ్లిక్‌గా చెప్పు చూపిస్తూ ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ అయ్యారు. సీన్ కట్ చేస్తే మారిన రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పిలుపు మేరకు ఈ ముగ్గురు నేతలు తిరిగి సొంత పార్టీ గూటికి చేరుకున్నారు.



**స్థానిక సంస్థలపై వ్యూహాత్మకంగా...**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్, బీజేపీలను కట్టడి చేసే వ్యూహంలో భాగంగా ఘర్ వాపసీకి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీలోకి నేతలు రాక మొదలు కావడం ఆసక్తిని రేపుతోంది. భవిష్యత్తులో మరింత మంది నేతలు ముఖ్యంగా పెద్ద తలకాయలే కాంగ్రెస్‌లో చేరబోతున్నాయని అధికార పార్టీలో చర్చ జరుగుతుండటంతో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఎవరెవరు పార్టీ మారబోతున్నారనే టాక్ ఆయా జిల్లాల్లో జోరుగా జరుగుతోంది. స్థానిక సంస్థల్లో ప్రభావం చూపే నాయకులపై హస్తం పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో జరుగబోయే పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి.

రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటూ మాజీ నేతలందరిని మళ్ళీ పార్టీలోకి ఆహ్వానిస్తుంది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు.. గతంలో సస్పెండ్ అయిన జిల్లా నేతలను మళ్లీ పార్టీలోకి ఆహ్వానించింది. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో హస్తం పార్టీ బలపడుతుందా..? అందరూ ఒకేతాటి పై ఉండి స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తారా.. లేదా అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

**సొంత గూటికి మాజీ నేతలు..**

కాంగ్రెస్ పార్టీలో సస్పెన్షన్‌ను గురై గత 20 నెలలుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న జిల్లా సీనియర్ నాయకులు మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డిలు మంగళవారం హైదరాబాద్ లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. పార్టీలో తిరిగి చేర్చుకోవడంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

**గ్రూపులు వీడి కలిసేనా..?**

ఆదిలాబాద్ లో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నాయి. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి, మరోవైపు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వర్గాలు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో మాజీ నేతలు సొంతగూటికి చేరడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. పార్టీ బలోపేతం కోసం అధిష్టానం మాజీలను తిరిగి చేర్చుకోవాలని ఇటీవలే నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం అవుతుండగా.. వీరు ఏ మేరకు కలిసి సాగుతారనేది..




ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.. స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నేతలంతా ఐక్యంగా ముందుకు సాగుతారా..? లేక మళ్లీ వర్గాలుగానే ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తారా అనేది వేచి చూడాలి.

**ఫలించని ఆ నేత ప్రయత్నాలు..?**

గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఆదిలాబాద్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలు తీసుకున్న నిర్ణయాల పట్ల.. పార్టీ అధిష్టానం క్రమశిక్షణలో చర్యల్లో భాగంగా ఆరేళ్ల పాటు సస్పెన్స్ వేటు వేసింది. అయితే ఈ నేతలు పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేశారు.అదేవిధంగా వీరిని పార్టీలోకి రానివ్వకుండా ఓ నేత కూడా తన ప్రయత్నాలు తాను చేశారు. కానీ ఎట్టకేలకు ఏఐసీసీ సెక్రటరీ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు అధిష్టానం సీనియర్లను తిరిగి సొంతగూటికి ఆహ్వానించింది.దీంతో జిల్లా కాంగ్రెస్ లో రాజకీయ పరిణామాలు మారనున్నాయి.

## బాసర వద్ద గోదావరిలో పెరుగుతున్న నీటి మట్టం



**బాసర, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

బాసర గోదావరి వాటర్ ఆలయ పురవీధుల్లోకి వచ్చేసింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో బాసర వద్ద గోదావరి నీటి మట్టం ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తోంది. బాసరలో జరిగిన వరద బీభత్సాన్ని ప్రజలు మరిచిపోకముందే గోదావరి మళ్లీ ప్రమాద స్థాయిని మించి ప్రవహించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి దాదాపు రెండు లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తుండగా, అంతకుతగ్గట్టుగానే విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా వరద ప్రవాహం పెరుగుతుండటంతో బాసర ఆలయ గోదావరి రహదారి బ్యాక్ వాటర్‌తో మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**వేమనపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

యూరియా కోసం వేమనపల్లి మండల రైతులు నీల్వాయి గ్రామంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డుపై మం గళవారం బైఠాయించి ఆందోళన చేప ట్టారు. పంటల దిగుబ డికి ఉపయోగపడే యూరియా కావాలంటూ ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలి తం లేకుండా పోవడంతో రై తులు అధికారులను నిలదీ శారు. సుమారు 2 గంటలకు పై గా రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెలల తరబడి యూరి యా కావాలని వ్యవసాయాధికారులను అడిగినా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూరి యా అందించడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్ మాట్లాడుతూ రైతులకు యూరియా అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్ర స్తుతం వరి, పత్తి పంటలకు యూరియా అత్యవసరం అయి నప్పటికీ రైతులకు యూరియా దొరకడం లేదన్నారు. రైతు లు రోడ్డుపై ఆందోళన చేయడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న నీల్వాయి ఎస్ఐ కోటేశ్వర్ సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించా రు. మండల వ్యవసాయాధికారి వీరన్న రెండు రోజుల్లో రైతుల యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందో ళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కుబిడె వెంకటేశం, కొండగొర్ల బాపు, బుర్ర రమే ష్‌గౌడ్,పాల్గొన్నారు.

**సిర్పూర్ (యూ), సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో మంగళవారం యూరియా కోసం సిర్పూర్(యు)-జైనూర్ రోడ్డుపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రెండు బస్తాల యూరియా కోసం రెండు మూడు రోజులుగా ఇక్కడికి వస్తున్నామన్నారు. యూరియా మాత్రం తమకు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రోజు మొత్తం వేచి చూసినా 60 యూరియా బస్తాలు మాత్రమే రైతులకు అందించారని చెప్పారు. వేలి ముద్రల యంత్రం సక్రమంగా పని చేయకపోవడంతో యూరియా పంపిణీలో అలస్యం జరుగుతుందని వ్యవసాయ అధికారులు చెప్పారు. దీంతో అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ఎస్సై రామకృష్ణ రైతులతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి యూరియా పంపిణీకి ఏర్పాటు చేస్తామని ఎస్సై చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఎస్సై వ్యవసాయ అధికారులతో మాట్లాడడంతోపాటు జైనూర్ నుంచి వేలి ముద్రల యంత్రం తెప్పించి రైతులకు యూరియా పంపిణీ చేశారు.

**చింతలమానేపల్లి :** యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. బాలాజీ అనుకోడ రైతు వేదిక వద్ద యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టగా రైతులు ఉదయం నుండే బారులు తీరుతున్నారు. ముందుగా టోకెన్లు రాయించుకున్న ఒక్కో రైతుకు కేవలం రెండు యూరియా బస్తాలు పంపిణీ చేస్తుండడంపై రైతులు ఆందోళన చేపట్టారు. పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అరగోస పెడుతుందని అన్నారు. రైతులు ఇంక ఎన్ని రోజులు యూరియా కోసం తిరగాలని ప్రశ్నించారు.

**సిర్పూర్(టి) :** మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం అధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. యూరియా పంపిణీకి ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్‌మండల అధ్యక్షులు అలంబీన్ ఆబ్దుల్లాతో పాటు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. దీంతో అదికారులు స్పందించి రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేశారు.









# కుమ్రం భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో**

**కెరమెరి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరెమెరి మండలం జోడేఘాట్‌లో కుమ్రం భీం 85వ వర్ధంతిని పురస్కరించుకొని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ, జిల్లా ఎస్.పి. కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హెలిప్యాడ్, వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసి కుమ్రం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్మా ట్లాడుతూ కుమ్రం భీం వర్ధంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 7న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, జోడేఘాట్ లో శాశ్వత సభ వేదిక నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. భద్రత దృష్ట్యా సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయాలని, వేడుకలకు వచ్చే ప్రజలకు భోజనం, త్రాగునీరు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని, హట్టి నుండి జోడేఘాట్ వరకు అవసరమైన బస్ లను నడపాలని ఆర్.టి.సి. అధికారులను ఆదేశించారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై శాఖల వారిగా స్టాల్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రజల సమస్యల ధరఖాస్తులను నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తామని, దర్బార్ లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. వర్ధంతి వేడుకలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలతో పాటు చత్తీస్ గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో గిరిజనులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఆసిఫాబాద్ శాసన సభ్యులు మాట్లాడుతూ జల్- జంగల్ - జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీమ్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి గ్రామాలు, గూడాలలో నివాస గృహాలు, త్రాగునీటి పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. వర్ధంతి వేడుకలలో భాగంగా పార్కింగ్ కొరకు వినియోగించే వ్యవసాయ భూమికి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు, స్థానిక గిరిజన ప్రజల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను నిర్మించాలని తెలిపారు. టూరిజం ఏర్పాటు చేయాలని, వర్ధంతి ఉత్సవానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అందరి సహకారంతో వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎ. ఎస్. పి. చిత్తరంజన్ ఈ.ఈ. తనాజీ, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి కుడ్మేత మనోహర్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెందోర్ రాజేశ్వర్, రాయి సెంటర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.







# ఖనిజ రంగం అభివృద్ధికి రూ.32వేల కోట్లు

**బంగారం, రాగి అన్వేషణకు సింగరేణికి అనుమతులు**
**లైసెన్సు పత్రాలను సీఎండీ ఎన్. బలరామ్‌కు అందజేసిన**
**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ చేయడానికి అనుమతిస్తూ జారీచేసిన లైసెన్సులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సింగరేణి సీఎండి ఎన్.బలరామ్‌కు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీ హబ్‌లో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక ఖనిజాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెమినార్‌లో వీటిని అందజేశారు. గత మార్చి నెలలో కేంద్ర గనుల శాఖ నిర్వహించిన కీలక ఖనిజాల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొని 37.75 శాతం రాయల్టీతో కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ పనిని దక్కించుకుంది. దీనికి సంబంధించిన లైసెన్సు, సర్టిఫికెట్లను మంగళవారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కీలక ఖనిజ రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కృషి చేయాలన్నారు. దేశంలో కీలక ఖనిజ రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణకు వేలంపాటలో విజేతలైన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. వెంటనే అన్వేషణ పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ తో పాటు తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, సింగరేణి డైరెక్టర్ (పి.పి) కె.వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ మరియు మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
• ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి •
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# బెల్లంపల్లి అటవీ రేంజ్‌లో పెద్దపులి సంచారం నిజమే

**ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ వెల్లడి**

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని కాసిపేట, దేవాపూర్, బెల్లంపల్లి బుగ్గ, మాదారం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం ఉందని బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ వెల్లడించారు. పెద్దపులి సంచారంపై ఆయన స్పష్టత ఇచ్చారు. గత కొంతకాలంగా అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి కదలికలు కనిపిస్తున్నాయన్నారు. గతంలో ఈ ప్రాంతంలో సంచరించిన బి-1 పెద్దపులి భూపాలపల్లి అడవుల వైపు వెళ్లిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రేంజ్ పరిధిలో సంచరిస్తున్న పెద్ద పులిని తిర్యాణి టైగర్‌గా చెబుతున్నామన్నారు. అటవీ రేంజ్ పరిధిలోని బుగ్గగూడెంలో 2, ముత్యంపల్లిలో 1, మాదారం అటవీ ప్రాంతంలో 3 నుండి 4 వరకు చిరుతపులులు సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. చిరుతపులల నుండి పెద్దగా ప్రమాదం లేకపోయినప్పటికీ అడవి మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు, అటవీ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

